J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 14

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 47 28.04.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### హతవిధీ.. ఇదీ విధి...

## కొడుకు విధుల్లో.. భార్య, కూతురు వీధుల్లో

### వై.యస్. హఠాన్మరణం తర్వాత అంతా అయోమయం

### వివాదాల వలయంలో వై.యస్. కుటుంబం

### తనయుడు ముఖ్యమంత్రి అయ్యాడన్న ఆనందం ఓవైపు..

### 'వై.యస్.' పేరు వివాదాస్పదమవుతుందన్న బాధ మరోవైపు

### వివేకా హత్య సైతం 'వై.యస్.' చుట్టూ తిరుగుతోంది

### ఆవేదన చెందుతున్న వై.యస్. అభిమాన గణం



**'వై.యస్.'** ఒకప్పుడు ఆ పేరు వింటేనే తెలుగువారి రోమాలు నిక్కబొడుచుకునేవి. వై.యస్. అంటే రాజసం. వై.యస్. అంటే హుందాతనం. వై.యస్. అంటే దర్జా. వై.యస్. అంటే ఠీవి. వై.యస్. అంటే క్రేజ్. వై.యస్. అంటే ఆకర్షణ. వై.యస్. అంటే శక్తి. వై.యస్. అంటే స్ఫూర్తి. వై.యస్. అంటే కీర్తి, వై.యస్. అంటే దీప్తి, వై.యస్. అంటే భరోసా. వై.యస్. అంటే నమ్మకం. వై.యస్. అంటేనే ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రెండక్షరాల సంచలనం. ఆయన పంచకట్టు, ఆయన నడక, నడత, నవ్వు... ప్రతిదీ ప్రత్యేకమే. ప్రతీ తెలుగు గుండె 'వై.యస్. మావాడు అంటూ' రొమ్ము విరుచుకుని మరీ గర్వంగా చెప్పుకుంటుంది.

12లో

# రాజన్నా క్షమించు!



1958 - 2023

## ఉత్తరక్రియలు

అమిత సౌమ్యుడు, ఉదారస్వభావుడు, దానశీలి, స్నేహశీలి,
బంధుజన హితుడు, అందరి హితం కోరుకునే మంచి మనిషి,
కొమరిక గ్రామస్థుడు, నెల్లూరు పొగతోట వాస్తవ్యులు

### శ్రీ కూకటి రవికుమార్ రెడ్డి గారు

తేది. 23.04.2023, ఆదివారం స్వర్గస్థులైనారు.
వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

తల్లి : కూకటి పార్వతమ్మ

భార్య : కూకటి ప్రసీద

కుమారుడు : కూకటి విశ్వఅభినవ్ రెడ్డి

అన్న - వదిన

కూకటి వేంకటరామి రెడ్డి - గిరిజా రెడ్డి

అక్క - బావ

దొడ్ల ప్రసన్నమ్మ - దొడ్ల నవీన్ రెడ్డి

**ఉత్తరక్రియలు :**

దశదిన కర్మ మే 3వ తేదీ బుధవారం ఉ॥ గం.9.10 ని॥లకు నెల్లూరు, పొగతోటలోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.



## ఆదర్శ అన్నదాత - రైతన్నలకు స్ఫూర్తిప్రదాత

# మారంరెడ్డి గోపాలరెడ్డి కన్నుమూత

**తో**టపల్లిగూడూరు మండలం ఇస్కపాళెం వాస్తవ్యులు, ప్రముఖ రైతు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు మారంరెడ్డి గోపాలరెడ్డి తమ 73వ ఏట అనారోగ్యంతో కన్నుమూశారు. 1950 ఏప్రిల్ 12వ తేది మారంరెడ్డి సుబ్బారెడ్డి - భూదేవమ్మల సంతానంగా జన్మించారు గోపాలరెడ్డి. బాల్య విద్యాభ్యాసం తోటపల్లిగూడూరు లోనూ, ఉన్నత విద్య నెల్లూరులోనూ పూర్తిచేశారు. 1969లో తన 19వ ఏట సోమిరెడ్డి వారి ఆడపడుచు ప్రసూనను పరిణయమాడి అల్లీపురం అల్లుడయ్యాడు.

పుస్తకాలలో చదువుకున్న పాఠాలకన్నా ఆయన జీవితంలో ఎదురైన అనుభవాలే గోపాలరెడ్డి విజయ ప్రస్థానానికి ఉపకరిం చాయంటే అతిశయోక్తి కాదేమో. రైతుగా వ్యవసాయం చేస్తూనే తన దృష్టిని పౌల్ట్రీ రంగం వైపు మరల్చారు. 1500 కోళ్ళతో మొదలుపెట్టి.. పాతికవేల కోళ్ళు పెంచే స్థాయికి వ్యాపారాన్ని విస్తరింపచేశారు. తాను ఏ పని చేపట్టినా నాణ్యతకే తొలి ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆ క్రమంలో లాభాలు తగ్గినా పరవాలేదనుకునే నైజం గోపాలరెడ్డిది. ఆ కారణంగానే పౌల్ట్రీ వ్యాపార స్థాయి పెద్దదిగా ఉన్నా లాభాలు అంతంత మాత్రంగానే ఉండేవి. చిన్నగా తన దృష్టిని ఆక్వారంగం వైపు మరల్చారు. అక్కడా కష్టాలు, నష్టాలే గోపాలరెడ్డిని వెంటాడాయి. అయితే, అదే సమయంలో ఇటు ఆక్వా రంగానికి అటు వ్యవసాయా నికి బాగా ఉపయోగపడే వర్మీ కంపోస్ట్ (జీవన ఎరువులు) తయారీపైన గోపాల రెడ్డి చూపు పడింది. అనుకున్నదే తడవుగా ప్రకృతిలో భాగమైన వానపాములతో సహజసిద్ధమైన జీవన ఎరువులు తయారు చేసే పనికి గోపాలరెడ్డి శ్రీకారం చుట్టారు. వర్మీ కంపోస్ట్ తయారు చేసేందుకు అవ సరమైన పేడ కోసం పదుల సంఖ్యలో పశువులతో డైరీని స్థాపించారు. కాల క్రమంలో పదుల సంఖ్య పశువులు కాస్తా వందలసంఖ్యకు చేరాయి. కొన్ని వేలలీటర్ల పాలు సరఫరాచేసే డెయిరీగా గోపాలరెడ్డి డెయిరీ ప్రసిద్ధి చెందింది. తాను స్థాపిం చిన 'సాయి శరత్ వర్మీ కంపోస్టు' సంస్థ



2007, జనవరి 17న ఆనాటి ముఖ్యమంత్రి డా. వై.యస్.రాజశేఖరరెడ్డి చేతులమీదుగా 'రాష్ట్రస్థాయి ఉత్తమరైతు' అవార్డును అందుకుంటున్న మారంరెడ్డి గోపాలరెడ్డి

అనేకమందికి జీవనోపాధిగా మారింది. పోయిన చోటే వెతుక్కోవాలన్న ఆలోచన, నమ్మిన రంగంలోనే రాణించాలన్న సంకల్పం, అనుకున్నది సాధించాలన్న తపన, చేసే పని ఏదైనా అంకితభావంతో చేయాలన్న పట్టుదల వంటి లక్షణాలే గోపాలరెడ్డిని ఉత్తమ రైతుగా నిలబెట్టాయి. అన్ని వ్యవసాయ ఆధారిత అనుబంధ ఉత్పత్తులతో తాను చేపట్టిన వ్యాపారాలు ఆయనకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించేలా చేశాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే సంచలనాత్మక ముఖ్యమంత్రిగా పేరు గడిం చిన దివంగత మహానేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి చేతులమీదుగా 2007 జనవరి 17న "రాష్ట్రస్థాయి ఉత్తమ రైతు" అవార్డు అందుకునేలా గోపాలరెడ్డికి కీర్తిని తెచ్చిపెట్టాయి. తన చుట్టూ ఉన్న రైతులకు మంచి సలహాలు ఇచ్చేవారు. పలు పర్యా యాలు నీటి సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

మనిషి అతి సౌమ్యుడు. ఆధ్యాత్మిక చింతనాతత్పరుడు. దైవ భక్తి ఎక్కువ. వైట్ & వైట్‌లో ఎప్పుడూ నీట్‌గా ఉండేవారు. తన వస్త్రధారణలో ఎంత తెల్లదనం ఉం దేదో ఆయన మనసు కూడా అంతే నిష్కల్మ షంగా ఉండేది. చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా అందరినీ ఒకేలా గౌరవించే వారు. ఆయనకి రాజి, రాధిక ఇద్దరు కుమార్తెలు. ఆనం మహేష్‌రెడ్డి పెద్దల్లుడు కాగా, ఆల్తూరు మహేష్‌రెడ్డి చిన్నల్లుడు. సహజంగానే ఆధునిక భావాలు కలిగిన గోపాలరెడ్డికి... ఇద్దరు అల్లుళ్ళూ 'ఏ.మహేష్'లు కావడం విశేషం. ఇద్దరి అల్లుళ్ళ స్నేహితులతో ఆయనకూడా కలిసిపోయేవారు, వాళ్ళు కూడా గోపాల రెడ్డిని 'మామా' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు.

ఏప్రిల్ 12వ తేదీన 73 సంవత్సరాలు పూర్తి చేసుకుని 74వ ఏట అడుగిడిన గోపాలరెడ్డి సరిగ్గా పదిరోజుల లోపే ఏప్రిల్ 21న కన్నుమూయడం ఆయన కుటుంబసభ్యులతో పాటు వారి స్నేహితు లను, ఆప్తులను విషాదంలో ముంచేసింది. ఆదర్శఅన్నదాతగా, సాటి రైతన్నలకు స్ఫూర్తి ప్రదాతగా పేరుగడించి దివంగతులైన గోపాలరెడ్డి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ... వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## వైద్యంలో ధన్వంతరి - దానంలో కర్ణుడితో సరి!

## ఆధ్యాత్మిక తత్పరుడు - సమాజసేవా పరాయణుడు

# డాక్టర్ సి.ఆర్.రెడ్డి.. అస్తమయం

***నా**డెరిగిన వైద్యుడిగా 70 సంవత్సరాలకుపైగా సేవలందిస్తూ, అటు వైద్య ఆరోగ్య రంగంలోనూ, ఇటు సేవారంగంలోనూ కనిపించే దైవంగా గుర్తింపు పొందిన డాక్టర్ చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి (సి.ఆర్.రెడ్డి) ఏప్రిల్ ఏప్రిల్ 24వతేదీ సోమవారం తమ 92వ ఏట తుదిశ్వాస విడిచారు. దాదాపు 6 దశాబ్దాలపాటు ఎన్నో ఆగే గుండెలను ఆడించి మరణాన్ని ఓడించిన ఆయనను మృత్యువు జయించింది.*

బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లి రాధాకృష్ణా రెడ్డి స్వగ్రామం. చిల్లకూరు వెంకురెడ్డి - శేషమ్మల రెండవ సంతానం సి.ఆర్.రెడ్డి. తమ పిల్లల చదువుల కోసం, వారి ఉన్నత భవిష్యత్తు కోసం వెంకురెడ్డి కుటుంబం 1943లో గూడూరుకు వలస వచ్చింది. తన 14వ ఏట అమ్మానాన్నలు తోబుట్టువులతో గూడూరుకు చేరుకున్నారు రాధాకృష్ణారెడ్డి. తన అన్న, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఒక్కొక్కరుగా తమతమ గమ్య స్థానాలను వెతుక్కుంటూ వెళ్లిపోయారు. రాధాకృష్ణారెడ్డి మాత్రం గూడూరునే తన పుట్టినిల్లుగా మార్చుకుని అక్కడే స్థిరపడిపోయారు.

ఆయన బాల్య విద్యాభ్యాసం పెనుబల్లి పరిసర ప్రాంతాలలో గడిచింది. ఇంటర్ మీడియట్ చదువుకి వి.ఆర్.సి వేదికయ్యింది. ఆ తరువాత డాక్టర్ పట్టా పుచ్చుకోవడం కోసం చెన్నపట్నం చేరారు. స్టాన్లీ మెడి కల్ కాలేజీలో వైద్యశాస్త్రంలో డిగ్రీ అందుకున్నారు. ముందుగా తలుపూరులో కొంతకాలం పనిచేసి, ఆ తరువాత నెల్లూరులోని డాక్టర్ పుచ్చలపల్లి రామ చంద్రారెడ్డి దగ్గర శిష్యరికం చేశారు. అక్కడ పనిచేసే కాలంలోనే మానవీయ విలువలు, సేవాతత్పరత వంటి సద్గుణాలను అలవరుచుకున్నారు. ప్రభుత్వ వైద్యుడిగా 1956లో విధులలో చేరి రవాణా, కరెంటు వంటి కనీస సౌకర్యాలు లేని మారుమూల గ్రామాలకు సైతం కాలినడకన కూడా వెళ్ళి వైద్య సేవలు అందించేవారు. ఓవైపు వైద్య సేవలు అందిస్తూనే.. మరోవైపు గుంటూరులో యం.ఎస్ పూర్తి చేశారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీలో కొద్దికాలం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.

ఆ తరువాతే ఆయన ఆలోచనలోపడ్డాడు. "వైద్యం అవసరమైన చోటకల్లా తాను వెళ్ళలేను, అదే తాను ఒకచోట ఉంటే తన అవసరమున్న వాళ్ళు తన దగ్గరకే వస్తారు. ఇలా అందరికీ తాను అందుబాటులో ఉం డొచ్చు." ఈ ఆలోచన వచ్చిన తక్షణమే 1966లో తన సొంతపేరుతో గూడూరులో 'సి.ఆర్.రెడ్డి హాస్పిటల్'ని ప్రారంభించి దాదాపు ఐదున్నర దశాబ్దా లుగా వైద్య సేవలు అందిం చారు. డాక్టర్ సి.ఆర్.రెడ్డి అన్న డాక్టర్ సి.ఎల్.ఎన్.రెడ్డి



పేరుమోసిన వైద్యుడిగా కావలిలో ప్రసిద్ధి. ఒక తమ్ముడు డాక్టర్ మోహన్‌రెడ్డి 'పది రూపాయల డాక్టర్'గా చెన్నై వాసులకు సుపరిచితులు. మరో తమ్ముడు ఆచార్య ముద్దుకృష్ణారెడ్డి తమిళనాట నివసించే తెలుగువారి ఆపద్భంధువుగా, తమిళనాట తెలుగువారి హక్కుల కోసం పోరాడే 'తలైవర్'గా ప్రఖ్యాతిచెందిన ప్రము ఖులు. వీరితోపాటు సి.ఆర్.రెడ్డి కుటుంబంలో 35 మందికిపైగా వైద్యవృత్తిలో వివిధ ప్రాంతాలలో ఉన్నారు. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి, రాధాకృష్ణారెడ్డికి వరసకి తమ్ముడవుతారు. విద్యా రంగంలోనూ సి.ఆర్.రెడ్డి సేవలు అభినందనీయం, ఆదర్శనీయం. తాను దానం చేయడం మాత్రమే కాదు, దానగుణమున్న దాతలను గుర్తించి, వారిని ప్రోత్సహించి వారిచేత విద్యాదానం చేయించడం సి.ఆర్.రెడ్డిలోని గొప్పతనానికి నిదర్శనం. ప్రభుత్వ వైద్యుడిగా తాను ఎక్కడ పనిచేస్తే అక్కడ ఒక హైస్కూలో, కళాశాలో ఏర్పాటు చేయించడం ఆయన ఆనవా యితీ. కోట గ్రామంలో వనజాక్షమ్మ పేరుతో కళాశాల, రాపూరులో సి.వి.కృష్ణయ్య పేరుతో ప్రభుత్వ డిగ్రీకళా శాల, విడవలూరులో ఒక హైస్కూలు, పొన్నలూరు రామ చంద్రారెడ్డి పేరుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గూడూరులో తన తల్లి పేరుతో చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూలు, మామ బొమ్మిరెడ్డి రమణారెడ్డి పేరుతో మున్సిపల్ స్కూలు, మనుబోలులో హైస్కూలుతో పాటు బద్వేలు వెంకన్న పాలెం హైస్కూలు ప్రారంభించడానికి కూడా సి.ఆర్. రెడ్డే స్ఫూర్తి. మహిళా విద్యను ప్రోత్సహిస్తూ 1981లో తన మిత్రుడు అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి సహకా రంతో వారి అత్తమ్మ జ్ఞాపకార్థం, దువ్వూరు రమణమ్మ పేరుతో గూడూరులో మహిళా కళాశాలను ప్రారంభిం చారు. 50 మందితో ప్రారంభించబడిన ఆ కళాశాల అంచలంచెలుగా ఎదిగి ఇప్పుడు సుమారు 2000 మంది విద్యార్థినులతో జాతీయస్థాయిలో కూడా గుర్తింపు పొందడం వెనుక ఆ కళాశాల కార్యదర్శిగా సి.ఆర్.రెడ్డి కృషి శ్లాఘనీయం. గూడూరు జడ్.పి. బాలికల హైస్కూలు భవన నిర్మాణ విషయంలో దాతలను ప్రోత్సహించి వారిచేత పది క్లాసు రూములు నిర్మించడానికి విరాళం ఇప్పించడం మాత్రమే కాకుండా, తాను 5 లక్షలు విరాళ మిచ్చి తన భార్య దివంగత చిల్లకూరు వెంకటసుబ్బమ్మ పేరుతో ఒక భవన నిర్మాణం చేయించారు.

గూడూరులో వయోజన విద్యను ప్రోత్సహిస్తూ రాత్రి పూట పర్యవేక్షిస్తూ, ఉచిత శిక్షణ ఇస్తూ సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి 30 సెంటర్లు నడిపించారు. లయన్స్ క్లబ్ సభ్యులుగా, అధ్యక్షులుగా అనేక సేవా కార్యక్రమాలు చేశారు. రోటరీ గౌరవ సభ్యులుగా మోక్షధామం నిర్మాణానికి భూరి విరాళాన్ని అంద జేశారు. గూడూరులో విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి తనవంతు సహాయంగా మూడు లక్షలు విరాళమిచ్చారు. ఆయనలోని ఆధ్యాత్మికతత్పరతకి గూడూరులోని సాయిబాబా మందిరం నిదర్శనం. ఆ భవన నిర్మాణానికి, అక్కడ జరిగే నిత్యాన్నదానానికి ప్రేరకులు, మూలకారకులు సి.ఆర్.రెడ్డే.

ఆయన జీవిత చరమాంకంలో మరో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గూడూరు పూలతోట గిరిజన కాలనీలో ఉన్న సరస్వతీ శిశు మందిరాన్ని దత్తత తీసుకొని పేద దళిత గిరిజన పిల్లలకు ఉచి తంగా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో దాతలను ప్రోత్సహించి విరాళాలిప్పించడం మాత్రమే కాకుండా, తాను స్వయంగా 40లక్షల వరకూ వెచ్చించి ఆధునిక వసతులతో భవన సముదాయం, బస్సు వసతి, మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి తన తండ్రి చిల్లకూరు వెంకురెడ్డి పేర దాన్ని నిర్వహించారు.

రాధాకృష్ణారెడ్డి కుమార్తె రోహిణి, అల్లుడు జనార్ధనరెడ్డిలు పెద్దాయన వారసత్వాన్ని కొనసాగి స్తున్నారు. ఆయన చూపించిన మార్గంలో, ఆయన ఆశయసాధనలో పరిశ్రమిస్తున్నారు. ఆయన ఉన్నప్పుడే ఆయన ఆకాంక్షలు నెరవేరుస్తామనే నమ్మకాన్ని ఆయనకి కలిగించారు.

6 దశబ్దాల కాలంలో గూడూరు స్థితిగతులను మార్చేలా, గూడూరు ప్రాంత ప్రజల జీవన విధానాలు మారేలా అక్కడి వాళ్ళని ప్రభావితం చేసిన ఆదర్శ మూర్తి డాక్టర్ చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి. అతి చిన్న వయసులో రామకోటి రాసిన తమ తల్లి శేషమ్మ పూజా ఫలమే తమ కుటుంబానికి శ్రీరామ రక్ష అని బలంగా నమ్మే సి.ఆర్.రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరు కుంటూ, ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది 'లాయర్'.

# ఉత్తరక్రియలు



జననం : 01.03.1929

నిర్యాణం : 24.04.2023

వైద్య - విద్యా రంగాలలో కీర్తిశిఖరమై.. పేదల గుండెల్లో నిలిచారు.
ఏడు దశాబ్దాలుగా వైద్యరంగాన ప్రాణదాతగా జీవించారు.
మాకు స్ఫూర్తిదాత, మా అభివృద్ధి ప్రధాత, మా జీవన విధాత

## డాక్టర్ సి.ఆర్.రెడ్డి గారు

తేది. 24.04.2023 సోమవారం స్వర్గస్తులైనారు.
మీ జీవితం సేవకు అంకితం.. మీ ఆంతర్యం సాయికి అర్పితం.
మీరు లేని కొరత తీర్చలేనిది.. ఆ లోటు ఇంకెవరూ పూడ్చలేనిది.

**మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...**

**చిల్లకూరు సుధీర్‌రెడ్డి - ప్రసూన**
**డాక్టర్ చిల్లకూరు మెహర్మణి**
**డాక్టర్ చెరుకూరు రోహిణి - డాక్టర్ చెరుకూరు జనార్ధన్‌రెడ్డి**

మనవళ్ళు - మనుమరాళ్ళు

**చిల్లకూరు ప్రదీప్‌రెడ్డి - స్మిత**
**సాయిచైతన్య - బొమ్మిరెడ్డి సునీల్‌రెడ్డి**
**డాక్టర్ చెరుకూరు రామ్‌కిరణ్‌రెడ్డి - డాక్టర్ స్వాతి**
**సాయిదీప్తి - గౌతమ్**
**డాక్టర్ గాయత్రి - డాక్టర్ రాకేష్**

మునిమనవళ్ళు, మునిమనుమరాళ్ళు

**నిషి, ధ్రువ్**
**రుచిర, విశృత్ సాయి**
**అద్వైత్, అనన్య**
**అన్వయ్**
**సాన్వి, స్మయన**

**ఉత్తరక్రియలు: తేది. 04.05.2023,** గురువారం ఉ॥ 10.30 గంటలకు గూడూరులోని సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

లాయర్
ఏప్రిల్ 28, 2023

# భూ తాపం.. మానవాళికి పెనుశాపంగా మారేనా?

భూతాపం మానవాళికి పెను శాపమవుతుందా?.. పెరుగుతున్న కాలుష్యంతో మానవ జీవనవిధానం అల్లకల్లోలంగా మారుతుందా?.. అతివృష్టి అనావృష్టి తదితర విపత్తులతో మానవ జీవితాలు రానున్న కాలంలో మరింత కల్లోల మవుతాయా?.. అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రపంచాన్ని కుదిపేస్తున్నాయి. భూతాపం వల్ల వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయని, ఫలితంగా మానవాళి భవిష్యత్తు అంతా అయోమయంగా మారనుందని స్వాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ గుటెర్రెస్ తాజా హెచ్చరిక అన్నిదేశాలను ఆలోచింపజేస్తోంది. భూ తాపం పెరిగితే ఫలితాలు దారుణంగా ఉంటాయని ఎంతోకాలం నుంచి శాస్త్రవేత్తలు చెప్తూనే ఉన్నారు. గత ఏడెనిమిదేళ్లుగా వాతావరణం బాగా వేడెక్కిపోతోందని, పర్యావరణం క్రమేణా దెబ్బతినిపోతుండడంతో కాలుష్యం పెరిగిపోయి భూగోళంలోని వాతావరణంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుండడం వల్ల మానవాళి గతంలోకన్నా దుర్భరమైన అనేక దుష్పరిణామాలను చవిచూడాల్సి ఉంటుందని ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా తన నివేదికలో పేర్కొంది.

ప్రపంచాన్ని కాపాడుతున్న హిమానీనదాలు నానాటికీ కరిగిపోతున్నాయని, సముద్రమట్టాలు పెరిగిపోతున్నాయని, అందువల్ల ఉష్ణోగ్రతలు గతంలోకంటే మరింత వేడెక్కుతున్నాయని ఆ సంస్థ పేర్కొంటోంది. దీంతో ప్రపంచంలోని సముద్ర వాతావరణంలో మార్పులు వచ్చి వడగాడ్పులు పెరుగుతూ అనేకదేశాల్లో ప్రజల ప్రాణాలమీదికి వస్తోందని, పలు దేశాల్లో కరువు కాటకాలు విజృంభిస్తున్నాయని ఆ నివేదిక విశ్లేషిస్తోంది. కర్బన ఉద్గారాల నియంత్రణ అన్నది చాలా ముఖ్యమైన అంశమని, దానిని నియంత్రించలేకపోతే భవిష్యత్తు అగమ్యగోచరమవుతుందని నిపుణుల ఉద్ఘాటన. ఇప్పటికే భూతాపం పెరగడం వల్ల అనేక దేశాల్లో ప్రజలు ఆ ఉష్ణోగ్రతల తీవ్రతను తట్టుకోలేక నానా కష్టాలు పడుతున్నారు. అగ్రదేశాలు, ముఖ్యంగా సంపన్న దేశాలు పర్యావరణంపై ఆశించిన స్థాయిలో దృష్టిపెట్టకపోవడం వల్ల ప్రమాదం అంతకంతకూ పెరిగిపోతోందని తాజా అధ్యయనాల సారాంశం. భూతాపం పెరిగేందుకు కారణమవుతున్న కర్బన ఉద్గారాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అగ్రదేశాలు అప్పుడప్పుడూ సమావేశాలు పెట్టి చెప్తున్న మాటలన్నీ కంటితుడుపు మాటలుగానే ఉంటున్నాయి తప్ప ఆచరణ నామమాత్రంగానే ఉండడం విచారకరం. కొద్దికాలం క్రితం పారిస్‌లో తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంకా అటకమీదనే ఉన్నాయి. అడవులను చిత్తం వచ్చిన రీతిగా నరికేయడం, వ్యవసాయంలో రసాయనాలను వాడడం, ప్లాస్టిక్ వంటి ప్రమాదకర వ్యర్థపదార్థాలను సరిగా నియంత్రించలేకపోవడం, మరోవైపు అణుపరీక్షలు, యుద్ధాలు వంటి కారణాలతో పర్యావరణం ప్రమాదంలో పడుతోంది. మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం నేలతల్లి పాలిట శాపంగా పరిణమిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సముద్ర తీరప్రాంతాల్లో ఏటా లక్షలాది టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లో కలుస్తుండడం వల్ల ఏర్పడే కాలుష్యం అంతాఇంతా కాదు. అటు సముద్రజీవుల మరణాలకు, ఇటు తీరప్రాంతాల ప్రజల అనారోగ్యాలకూ ఈ వ్యర్థాలు కారణమవుతున్నాయి. మనిషికి ప్రాణం పోసే ప్రకృతిని చేజేతులారా నాశనం చేసుకోవడం వల్ల చివరకది మానవాళికే పెను ప్రమాదం కాబోతోంది. ప్రకృతిపై విధ్వంసాన్ని విడనాడకపోతే ముప్పు తప్పదు.

ఇకనైనా ప్రపంచదేశాలు, అన్ని దేశాల్లోని ప్రజలు భవిష్యత్తులో రానున్న సంక్షోభాల నివారణకు ఇప్పటినుంచే పటిష్టమైన చర్యలు తీసుకోవడం అవసరం. ఇది ఏ ఒక్కరి పనో కాదు..ప్రపంచంలోని ప్రతి పౌరుడి బాధ్యత. అన్నిదేశాలు కలసికట్టుగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. భూమాతను రక్షించుకోవాలి. లేకుంటే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం ఉండదు. అన్నిదేశాల ప్రభుత్వాలు ఇకనైనా పర్యావరణ పరిరక్షణకు కంకణం కట్టుకోవాలి. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేకశాఖలు, ప్రత్యేక బడ్జెట్, ప్రత్యేక వ్యవస్థలు, ప్రత్యేక యంత్రాంగాలను తక్షణమే రూపొందించి అమలుచేయాలి. అలక్ష్యం చేసినా, ఆలస్యం చేసినా పరిస్థితులు చేయిదాటిపోతాయి. చిత్తశుద్ధి లేని సమావేశాలు మొక్కుబడి మాటల వల్ల ఒరిగేదేమీ ఉండదు. చల్లని నేలతల్లిని కాపాడుకోకపోతే.. మానవాళికి భవిష్యత్తే కాదు.. మనుగడే ఉండదు.

## పేరుకు పెద్దాసుపత్రి.. వసతుల్లో చిన్నాసుపత్రి

నెల్లూరులోని పెద్దాసుపత్రి పేరుకు పెద్దదే అయినా, వసతుల్లో మాత్రం ఇంకా చిన్నాసుపత్రిగానే ఉంది. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లు నిత్యం రకరకాల అవస్థలు పడుతున్నా అక్కడెవరూ పట్టించుకోని స్థితి. లిఫ్ట్ సరిగా పనిచేయకపోవడంతో రోగులు, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఆసుపత్రిలోకి రావాలంటే ఎంతో ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్య ఎప్పటినుంచో ఉంది. అధికారులేమో అప్పటికప్పుడు బాగుచేస్తామంటారే కానీ, చేసేదేమీ ఉండదు. ఒకవేళ చేసినా మళ్లీ రెండుమూడు రోజులకల్లా పనిచేయవు. తరచూ అవి చెడిపోతుండడం ఏమిటో ఎవరికీ అర్థంకాదు. కోట్ల రూపాయలు వెచ్చించి అధునాతన వైద్యయంత్రాలు తెప్పించి ఉంచారు. కానీ, అవి ఎప్పుడూ ఉపయోగపడవు. ఎందుకలా అని ప్రశ్నిస్తే.. వాటిని ఆపరేట్ చేసే సమర్థత కలిగిన టెక్నీషియన్లు దొరకడం లేదంటూ కుంటిసాకులు చెప్తున్నారు. నిజానికి నగరంలో కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం లేని అత్యాధునిక వైద్యపరికరాలు మన పెద్దాసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. కానీ, అవి సరిగా ఉపయోగపడడం లేదు. ఈ అవస్థలు ఎప్పుడు తీరుతాయో ఏమో!...

**– కె. వెంకటేశ్వర్లురెడ్డి, నెల్లూరు.**

## ధరిత్రిని కాపాడుకోవాలి

ధరిత్రిని కాపాడుకోవాలంటూ ఏప్రిల్ 22న ప్రపంచ ధరిత్రి దినోత్సవం ప్రతిఏటా జరుగుతుండడం హర్షదాయకం. పాఠశాలల్లో విద్యార్థులకు కూడా ఇప్పుడు ధరిత్రి విశిష్టత, పర్యావరణ పరిరక్షణ గురించిన పలు అంశాలను తెలుసుకుంటున్నారు. అయితే, ప్రకృతిని పరిరక్షించుకోవడం అన్నది విద్యార్థి దశ నుంచి అందరికీ అలవడాలి. కాలుష్యం పోవాలన్నా, పచ్చదనం వెల్లివిరియాలన్నా మొక్కలు పుష్కలంగా ఎదగాలి. అన్నిప్రాంతాల్లో పాఠశాలల్లోనూ, గ్రామప్రాంతాలు, పట్టణప్రాంతాల్లోనూ విరివిగా మొక్కలు నాటేందుకు అందరూ సమాయత్తం కావాలి. ముఖ్యంగా విద్యార్థులతో విరివిగా మొక్కలు నాటించి, వాటికి క్రమం తప్పకుండా నీళ్లుపోసి పెంచే పద్ధతిని వారికి అలవాటుచేయాలి. భావితరాల భవితకు ఇది ఉపయోగం అవుతుంది కనుక, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ఈ విషయాలపై దృష్టిపెట్టి తమ పిల్లలను చైతన్యవంతం చేయాలి.

**– ఎస్. అనూరాధ, ఇందుకూరుపేట.**

ఈ-మెయిల్
ప్రజావాణి
@
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## నిప్పుతో చెలగాటం వద్దు

ఈ మండే ఎండల్లో నిప్పుతో చెలగాటమాడవద్దు. ఏ మాత్రం అలక్ష్యంగా ఉన్నా నిప్పులే మంటలై భీభత్సం సృష్టిస్తాయి. ఇటీవల మర్రిపాడు మండలంలో ఎవరో చెత్తనంతా కాల్చివేయాలని నిప్పంటిస్తే, అది చివరికి గాలికి మంటలుగా మారి ఆ చుట్టుపక్కల ఉన్న విలువైన టేకుచెట్లు, నిమ్మచెట్లు కాలిపోయి పెద్ద ఎత్తున నష్టం ఏర్పడినట్లు పేపర్లలో వార్తలు వచ్చాయి. నిప్పుతో జాగ్రత్తగా ఉండకపోతే ఇలాంటి చిన్నచిన్న పొరపాట్లే..పెద్ద అగ్నిప్రమాదాలవుతాయి. కాబట్టి జాగ్రత్త సుమా!... అంతేకాదు, అగ్నిప్రమాదాలకు గురై సర్వస్వం కోల్పోయిన బాధితులను మానవతా హృదయంతో అందరూ ఆదుకోవాలి కూడా.

**– కె.ప్రభాకర్, జలదంకి.**

## మెరుగు పేరుతో మోసాలు



మోసాలు రకరకాలు. సులభంగా మోసపోయే అమాయకత్వం మనకుండాలే గానీ, నమ్మించి బురిడీ కొట్టించేవాళ్ళు నేటి సమాజంలో కోకొల్లలు. మోసం చేసి పబ్బం గడుపుకునేవారి సంఖ్య పెరిగిపోతుండడం, ఈజీ మనీ (సులువుగా డబ్బు సంపాదించాలనుకోవడం) కోసం ప్రాకులాడేవారు అధికమవుతుండడంతో ఎక్కడ చూసినా మోసాలు ప్రబలిపోతూనే ఉన్నాయి. చెడుతిరుగుళ్ళకు అలవాటు పడినవాళ్ళు, జూదాలకు–తాగుడుకు బానిసలై నిత్యం వాటికి డబ్బు తగలేసేవాళ్ళు, ఏదో ఒక విధంగా డబ్బు చేజిక్కించుకోవాలనేందుకు రకరకాల మోసాలకు పాల్పడుతున్నారు. బజారుకెళ్తే మోసం జరుగుతుందేమో అనుకునేరు..ఇప్పుడు ఇళ్ళవద్దకే మోసాలు వచ్చేస్తున్నాయి. వీధివీధిలో, ఇంటింటికీ తిరుగుతూ ఎవరు ఏమారుతారా, వాళ్ల కొంపలు కూలుద్దామా అని మోసగాళ్ళు తిరుగుతూనే ఉంటారు. ముఖ్యంగా అమాయకులైన మహిళలు కనిపిస్తే చాలు..వాళ్ళను సునాయాసంగా మోసం చేసేస్తుంటారు. తరుగు పేరుతో కొంతమంది మోసం చేస్తే, ఇళ్లకాడకే వచ్చి మెరుగు పేరుతో మోసాలు చేసేవాళ్లు బోలెడంతమంది. బంగారు వస్తువులకి మెరుగు పెడతామని కొందరు నమ్మబలుకుతారు. ఇళ్లల్లో ఉన్న ఆడవాళ్ళు అది నిజమేనని నమ్మి, ఇంట్లో ఉన్న బంగారు వస్తువులు తెచ్చిస్తారు. అందరు చూస్తుండగానే వారు వాటికి మెరుగుపెడుతుంటారు. మధ్యలో ఆమాటా ఈమాటా చెప్పి, మంచినీళ్లు ఇవ్వమనో లేదో మరోపనో చెప్తారు. తెచ్చిచ్చేలోగా ఉడాయించేస్తారు. ఆ తర్వాత లబోదిబోమంటూ ఎక్కడ వెతికినా కనిపించరు. క్షణాల్లో మాయమైపోతారు. మరికొంతమంది వస్తుంటారు. మా దగ్గర అన్నిరకాల వస్తువులకు మెరుగుపెట్టే మహత్తరమైన పౌడర్ ఉందంటారు. ప్యాకెట్ కేవలం 20 రూపాయలేనని, కావాలంటే చూడండని, అక్కడ అందుబాటులో ఉన్న వస్తువులకు ఆ పౌడర్ పూసే ప్రయత్నం చేస్తారు. వద్దనుకుంటూనే ఆడవాళ్ళు..వారి మాయమాటలకు లొంగిపోయి, ఇంట్లో ఉన్న పాత వస్తువులన్నీ తెచ్చి వాళ్ల ముందు పడేస్తారు. వాళ్ళు వాటికి మెరుగు పెడుతూనే కాళ్ల పట్టీలకు, రాగి వస్తువులకు, బంగారు వస్తువులకు మెరుగుపెట్టి మీ ముందే ధగధగలాడిస్తామంటారు. తక్కువ ఖర్చుతో మెరుగు పెట్టుకోవడం మంచిదే కదా..అని ఆడవాళ్ళు నమ్మేస్తారు కదా!... అలా వాటికి మెరుగుపెడుతూనే ఉంటారు..ఏదోఒకటి చెప్పి, వాళ్ళను ఏమార్చి తుర్రుమని పరారైపోతుంటారు. వాళ్ళను పట్టుకోవడం బ్రహ్మకు కూడా అలివికాదు.

## సమస్యల తో 'రణం'

అంత మాయగాళ్ళన్నమాట. ఇంకొంతమంది కేటుగాళ్ళు వాళ్ల కళ్ళముందే మెరుగు పెట్టిన నగలను వాళ్లకు పొట్లం కట్టి ఇస్తారు. మెరుగు పట్టిచ్చినందుకు డబ్బులు తీసుకుని వెళ్ళిపోతారు. ఇంట్లోకి వెళ్ళి చూసుకుంటే ఆ పొట్లంలో నగలుండవు. చిన్న చిన్న గులకరాళ్ళుంటాయి. మా వద్ద అద్భుతమైన రసాయనం ఉందని, దాంట్లో బంగారు వస్తువులు వేసి కాస్త వేడిచేస్తే నిగనిగా మెరిసిపోతాయని చెప్తారు మరికొందరు ఇళ్లకాడకే వచ్చి. నగలు తెచ్చి కప్పులో వేసి, మీరే వేడి చేసుకోండి.. అంటారు. నగలు తీసుకువచ్చి వారికివ్వగానే, మన కళ్ళముందే వాటిని కప్పులో వేస్తారు. ఇంట్లోకి వెళ్ళి స్టౌమీద పెట్టేటప్పుడు చూస్తే నగలు బదులు గులకరాళ్ళుంటాయి. వెనక్కి తిరిగి చూసేసరికి ఆ మోసగాళ్ళు ఆ నగలతో పరుగోపరుగు!...అలా మెరుగు పెట్టేటప్పుడు, చుట్టూ ఎంతమంది ఆడాళ్ళున్నా వాళ్లకి లెక్కలేదు. తాము పరుగెడితే ఎవరూ పట్టుకోలేరని వాళ్ళకి తెలుసు. ఇదిలావుంటే, మరికొంతమది దొంగ బాబాలుంటారు. మోసాలకే ఆ వేషం వేస్తుంటారు తప్ప, వారికి ఎలాంటి మహిమలు ఉండవు. మీ దగ్గర ఎంత డబ్బుంటే అంతకు పదింతలు చేస్తాం..ఎన్ని నగలుంటే అంతకు నాలుగింతలు చేస్తాం..అంటూ ఇళ్ళ దగ్గరకి వస్తారు. చూసేందుకు మంచి సాధువుల్లా కనిపించడంతో..అలా ఎలా చేస్తారు స్వామీ అని అడిగితే, ఒక కుండను జోలెలోంచి బయటకు తీస్తారు. ఆ కుండలో నగలు, డబ్బు వేసి పూజలు చేస్తే అవన్నీ కుండనిండుగా వస్తాయంటారు. నమ్మి, నగలు తెచ్చి అందులో వేస్తే, వాటిపై విభూతి పోసి పూలు వేసి పూజలు ప్రారంభిస్తారు. అందరూ తూరుపుతిరిగి దండం పెట్టాలని, ఆ కుండలో మహాశక్తి దాగి ఉంటుందని, సరిగ్గా ఏ అర్ధరాత్రో కుండకు కట్టిన గుడ్డను విప్పితే చాలు.. అందులో నగలు నిండుగా ఉంటాయని చెప్తారు. ఇవన్నీ వినేది అమాయకులే కదా!... బహు జాగ్రత్తగా వింటారు. ఆ దొంగబాబాలు చెప్పినట్లే చేస్తారు. ఇంట్లో దాచిపెట్టిన నగానట్రా అంతా తెచ్చి అందులో వేస్తారు. పూజలన్నీ అయ్యాక ఆ కుండని బాబాలు వాళ్లకి ఇచ్చేసి మరో రెండు గంటల తర్వాత తెరవండి..కుండనిండా డబ్బు, నగలు ఉంటాయని చెప్పి అక్కడనుంచి చల్లగా జారుకుంటారు. కాసేపు ఉండండి స్వామీ, కుండ విప్పాక వెళ్దురు అని చెప్తే, అందుకు 'మేం చెప్పినప్పుడు మాత్రమే కుండ తెరవాలి. లేకుంటే ఆ మహాశక్తి మిమ్మల్ని ఆవహిస్తుంది' అని భయపెడతారు. నిజమో కాబోలని..వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, వాళ్ళు చెప్పిన సమయానికి కుండ మూత విప్పితే..ఇంకేముందీ...ఆ కుండలో మనం వేసిన నగలకు బదులు గుడ్డపేలికలు, కుండపెంకులు, రాళ్లురప్పలు ఉంటాయి. పూజలు చేస్తున్నట్లు నటిస్తూనే మనల్ని ఎప్పుడో ఏమార్చేసి కుండలో నగల్ని కాజేసి, రాళ్ళుముక్కల్ని కాయితాల్లో చుట్టి..వాకచక్యంగా ఆ కుండలో పెట్టేస్తారు. ఇలాంటి మోసాలు ఒక్కచోటని కాదు..అన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో తరచూ జరుగుతూనే ఉంటాయి. పట్టణాల్లోకి కూడా ఇలాంటి మోసాలెన్నో వ్యాపిస్తున్నాయి. వీధుల్లో మనకు తెలియనివారితో, ఇళ్ళకాడికి వచ్చి మాయమాటలు చెప్పి మోసంచేసే వాళ్లతో, ముఖ్యంగా అపరిచితులతో చాలా జాగ్రత్తగా ఉండాలని, మోసకారుల్ని నమ్మవద్దని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నారు. ఆశకుపోతే.. మోసం ఎదురవుతుంది..ఉన్న ఆ కాస్త సొత్తు కూడా పోకుండా...తస్మాత్ జాగ్రత్త!

**– సంచారి**

# జిల్లాలో వెంకయ్య పర్యటన

## వెంకటాచలంలో అక్షరవిద్యాలయం వార్షికోత్సవం

## ఆత్మకూరులో ఆత్మీయ సమ్మేళనం - సుందరయ్య విగ్రహ ఆవిష్కరణ

భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య జిల్లాలో పర్యటించారు. హైదరాబాదు నుండి 24వ తేదీ రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 25 తెల్లవారురుఝామున నెల్లూరుకు చేరుకున్నారు. అదేరోజు ఉదయం జిల్లా కలెక్టర్ హరినారాయణన్ వెంకయ్యను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. 25వ తేదీ సాయంత్రం వేంకటాచలం సమీపంలో గల సరస్వతినగర్‌లోని అక్షర విద్యాలయం 12వ వార్షికోత్సవంలో ప్రధాన అతిథిగా వెంకయ్య పాల్గొన్నారు. కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి కూడా ఈ సంబరంలో విశిష్టఅతిథిగా పాల్గొన్నారు.



### విలువలతో కూడిన విద్య అవసరం - వెంకయ్యనాయుడు

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా పాఠశాలలు మన భారతీయ సంస్కృతిని విద్యలో భాగంగా రేపటిపౌరులకు అందించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ విలువలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో ఏర్పాటైన అక్షర, ఆ స్ఫూర్తి కాపాడుకోవటం అభినందనీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక విద్యా విధానాలను అధ్యయనం చేస్తూ, అందులో ఉత్తమమైన వాటిని స్వీకరిస్తూ భావిభారత పౌరులను భవిష్యత్ భాగ్యవిధాతలుగా తీర్చిదిద్దుతున్న అక్షర పాఠశాల కరస్పాండెంట్, తన కుమార్తె శ్రీమతి దీపా వెంకట్‌ని ప్రత్యేకంగా అభినందించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు విలువలు, నైతికతను అలవర్చుకోవాలని సూచించారు. అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ.. ఉన్నతమైన స్థానాలకు ఎదిగేందుకు బాటలు వేసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా 'యువ టూరిజం క్లబ్'ల ద్వారా యువతలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక కట్టడాలపై అవగాహన పెంచడంతోపాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తుచేస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ విషయాల్లోనూ విద్యార్థులు బాధ్యత తీసుకోవాలని సూచిస్తూ... విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివి.. నెల్లూరుజిల్లాకు, ఆంధ్రప్రదేశ్‌కు, భారతదేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

'ఆజాదికా అమృతోత్సవ్' సందర్భాన్ని థీమ్‌గా తీసుకుని అక్షర యాజమాన్యం రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలు రేపటి తరానికి స్ఫూర్తిదాయకం కావడమే కాకుండా అందరినీ అలరించాయి.




### ఆత్మకూరులో వెంకయ్య....

26వ తేదీ బుధవారం వెంకయ్య ఆత్మకూరుకు వెళ్లారు. అక్కడ శ్రీధర్ గార్డెన్స్ కళ్యాణమండపంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో తన పాత మిత్రులని, అభిమానులని కలుసుకున్నారు. ఆత్మకూరుతో ఉన్న పాత స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు.





### అజాతశత్రువు సుందరయ్య!

మచ్చలేని రాజకీయ నాయకుడిగా, మనసున్న ప్రజా సేవకుడిగా పేరు గడించిన మాజీ శాసనసభ్యుడు, డాక్టర్ సుందరరామిరెడ్డి కాంస్య విగ్రహాన్ని 26వతేదీ సాయంత్రం వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తనపై పోటీచేసి తనను ఓడించిన నాయకుడి విగ్రహాన్ని తానే ఆవిష్కరించడం, రాజకీయాలు వేరు, స్నేహ బంధాలు, మానవ సంబంధాలు వేరు అన్న వెంకయ్య సిద్ధాంతానికి నిదర్శనం.

ఆత్మకూరుకు నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది అంటూ, ఆత్మకూరు ప్రజల ఆత్మీయత మరువలేనిదని, ఉదయగిరి తనను గెలిపించి రాష్ట్ర రాజకీయాల వైపు నడిపిస్తే, ఆత్మకూరు ప్రజలు కొద్ది తేడాతో ఓడించి కేంద్ర రాజకీయాల వైపు నడిపించారన్నారు.

ఏప్రిల్28 వరకు వెంకయ్యనాయుడు జిల్లాలోనే ఉంటారు. 27వ తేదీ గురువారం స్వర్ణభారత్ ట్రస్టులో అభిమానులకు అందుబాటులో ఉన్నారు. 28 మధ్యాహ్నం నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి విజయవాడకు వెళ్తారు. ఉపరాష్ట్రపతి పదవీ బాధ్యతలనుండి తప్పుకున్న తరువాత తమ నాయకుడు తరచూ జిల్లాకు వచ్చి కొన్ని రోజులు వారి మధ్య గడిపి వెళ్ళడం పట్ల వెంకయ్య అభిమానులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.








జననం : 01.03.1929 నిర్యాణం : 24.04.2023

శ్రద్ధాంజలి

మానవతామూర్తి, సేవాదీప్తి
మాకందరికీ స్ఫూర్తి, మా కుటుంబ కీర్తి
గూడూరు దశ, దిశ మార్చిన
చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి గారి
( డాక్టర్ సి.ఆర్.రెడ్డి )
ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

తమ్ముడు - మరదలు
ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై
తమ్ముని కుమారుడు - కోడలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై
తమ్ముని కుమార్తె - అల్లుడు
శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ
తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
జయేష్ & అస్మిత కీర్తన లక్ష్మి & తనవ్



# భక్తిశ్రద్ధలతో రంజాన్

పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని ఈనెల 22న జిల్లావ్యాప్తంగా ముస్లిమ్‌సోదరులు ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. జిల్లాలోని అన్ని దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నెల్లూరులోని ప్రసిద్ధమైన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిమ్ సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేసుకున్నారు. సకల మానవాళిని సన్మార్గంలో నడిపేందుకు రంజాన్ మాసంలో ఖురాన్ అవతరించిందని, అందుకే రంజాన్ మాసానికి అంత పవిత్రత ఉందని మతపెద్దలు రంజాన్ విశిష్టతను తెలుపుతూ సందేశాలనిచ్చారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ముస్లిమ్ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ వేంకటేశ్వరాలయంలో లక్షమల్లెల పూజ



నెల్లూరు వెంకటేశ్వర పురంలో కొలువై వున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 23న లక్ష మల్లెల పూజ వైభవంగా జరిగింది. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఈ వేడుక నిర్వహించారు. మహిళాభక్తులకు పసుపుకుంకుమలు అందజేశారు, దామేగుంటకు చెందిన చిమటా శేషగిరిరావు-హరిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఛైర్మెన్ నాగిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, అర్చకుడు సాయిభరద్వాజ పర్యవేక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## కొత్త కమిషనర్‌ను కలిసిన ఎన్జీఓ నాయకులు



నెల్లూరు నగరపాలక సంస్థ కొత్త కమిషనర్ వికాస్‌మర్మత్‌ను ఆయన చాంబర్‌లో ఈనెల 24న ఏపి ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంచలరావునాయుడు, వెంకటస్వామిలు కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. అసోసియేషన్ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, గాదిరాజు రామకృష్ణ, కృష్ణంరాజు, కరుణమ్మ, కృష్ణకుమార్; విజయకుమార్, రాజేంద్రప్రసాద్, రామకృష్ణారెడ్డి, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆనం వివేకా సేవలు చిరస్మరణీయం

• వర్ధంతిలో పాల్గొన్న అభిమానులు



నెల్లూరు ఎమ్మెల్యేగా ఆనం వివేకానందరెడ్డి నెల్లూరుకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన అభిమానులు గుర్తుచేసుకున్నారు. వివేకా 5వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 25న స్థానిక ఏసీనగర్‌లో జరిగింది. వివేకా తనయుడు ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం అభిమానులు వివేకా సమాధి వద్ద నివాళులర్పించారు. తన తండ్రి ఆశయాల సాధనకు కృషిచేస్తానని, అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని రంగమయూర్‌రెడ్డి చెప్పారు. వివేకా అభిమానులు పత్తి బాబు, రాఘవరెడ్డి, బిజివేముల రమణారెడ్డి, ముసవ్విర్, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

### డా.సూరం శ్రీనివాసులుకు..

## పద్యసారస్వత పరిషత్ సన్మానం



తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శిగా నియమితులైన ప్రముఖ పండితులు డా. సూరం శ్రీనివాసులును పద్యసారస్వత పరిషత్ నెల్లూరుశాఖ వారు ఇటీవల నెల్లూరులో ఘనంగా సన్మానించారు. పోలవరపు నరసింహరావు సభకు అధ్యక్షత వహించగా, డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు సభను నిర్వహించారు. డాక్టరు మాచవోలు శివరామప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై సూరం వారు రచించిన 'కాలగీత' కావ్యాన్ని ఆవిష్కరించారు. స్వర్గీయ కల్వకాల రామకృష్ణమూర్తిచే కూర్చబడిన 'సంస్కృత మణిమాల'ను డా. సూరం శ్రీనివాసులు ఆవిష్కరించారు. బ్రాహ్మణ సంఘం వారు, స్థానిక ప్రముఖులు, నెల్లూరు ధర్మప్రచార పరిషత్ వారు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అగస్త్యరాజు సుబ్బారావు, డాక్టర్ రామకృష్ణ వరప్రసాదరావు, ఊరుబిండి సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వామినాయక్, టి.లక్ష్మీనారాయణ, శనగవరపు సత్యనారాయణ, సూరం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### ఇరుకళలమ్మవారి దేవస్థానం

## ఇఓగా.. మల్లికార్జున్‌రెడ్డి



నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన కార్యనిర్వాహణాధికారిగా బి. మల్లికార్జున్‌రెడ్డి నియమితులయ్యారు. అనంతరం ఆయన ఇఓగా బాధ్యతలు చేపట్టి, దేవస్థానం ఛైర్మెన్ ఆర్ఎస్ఆర్ (రావు శ్రీనివాసరావు)తో కలిసి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. దేవస్థానం అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని ఎంపీ ఆదాలను ఇఓ కోరారు. అనంతరం విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# 'తంగిరాల మహాభారతం' 52వ భాగం




కాశీరాజ కుమార్తె శివుణ్ణి ప్రత్యేకంగా కొన్ని కోరికలు కోరుతుంది. 5గురి పతుల సమక్షంలో సేవచేసే భాగ్యం, కామ సంతృప్తి, సౌభాగ్య ప్రాప్తి, కుమారీత్వసిద్ధి. శివుడు ఆ కోరికలు తీరాలంటే ఇంద్రుణ్ణి తన దగ్గరకు తీసుకురమ్మంటాడు.

ఇంద్రుడు గంగ తీరానికి వచ్చినప్పుడు, కాశీరాజ పుత్రిక అతన్ని శివుని దగ్గరకు తీసుకుని వెళుతుంది. అక్కడ శివుడు మనోహరమైన యువకుడి స్వరూపంలో ఇంకొక అందమైన యువతితో వినోదిస్తుంటాడు. ఇంద్రునికి కోపం వస్తుంది. శివుని ఆజ్ఞ మేరకు ఆ స్త్రీ ఇంద్రుణ్ణి తాకగానే, ఇంద్రుడు నేలమీద కూలపడిపోతాడు. శివుడు ఇంద్రుడి భుజబల శక్తి పరీక్షిద్దామని హిమవత్ పర్వతాన్ని ఛేదించి తీసుకు రమ్మంటాడు. ఇంద్రుడు ఆ పర్వత గుహలో ఇంకో 4గురు ఇంద్రులని చూస్తాడు. శివుని ఆజ్ఞ ప్రకారం, ఇంద్రుడు ఇంకో ఇంద్రుణ్ణి అవతరింపచేసి, ఆ 5గురు ఇంద్ర అంశలతో ధర్మ దేవత, వాయు, ఇంద్ర, అశ్విని దేవతల దివ్య తేజస్సుతో భూలోకంలో పాండవులుగా జన్మిస్తారు.




కాశీరాజ తనయ స్వర్గలక్ష్మి స్వరూపంతో అయోనిజగా ద్రుపదుని యజ్ఞగుండం లోంచి అవతరిస్తుంది. ఇదంతా వేద వ్యాసుడు చెప్పి, ద్రుపదునికి దివ్య దృష్టి ప్రసాదిస్తాడు. అప్పుడు ద్రుపదునికి పాండవులంతా ఒకే రూపంలో వున్న ఇంద్రుల్లా, ద్రౌపది స్వర్గలక్ష్మిలా కనపడతారు. ద్రుపదుడు సంతోషించి ఆరోజే మంచి రోజని అంగరంగ వైభవంగా ద్రౌపదిని ముందు ధర్మరాజుతో, క్రమక్రమంగా భీమార్జున, నకుల సహదేవులకిచ్చి వివాహం జరిపిస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. రంజాన్ వేడుకలు



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అసోసియేషన్ సభ్యులు అబ్దుల్‌ఖాదర్, నజీర్ అహ్మద్, రఫీ, సోను, బాషాలను సన్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు హరిబాబు, రామ్మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, కోశాధికారి నజీర్‌అహ్మద్, శ్రీనివాసులునాయుడు, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా..పరశురామ జయంతి



నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న శ్రీకృష్ణ యోగ మందిరంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి మందిరంలో ఇటీవల పరశురామ జయంతి ఘనంగా జరిగింది. వైశాఖశుద్ధ తదియ, అక్షయ తృతీయ శుభదినాలను పురస్కరించుకుని ఈ వేడుక నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ గణపతి సచ్చిదానంద శ్రీకృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ సారధ్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### దళితకవి గోపాలరావు..

## సంస్మరణ సభ

నెల్లూరు జిల్లా గౌరవరం గ్రామానికి చెందిన దళితకవి 'తొలినంజె' కవితాసంపుటి రచయిత దివంగత కందిపాటి గోపాలరావు సంస్మరణ సభ ఇటీవల నెల్లూరు సాహితీమిత్రుల ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక దర్గామిట్ట కరెంటాఫీస్ సెంటర్ లోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో జరిగిన ఈ సభకు పెరుగు రామకృష్ణ అధ్యక్షత వహించారు. కవులు గుండాల నరేంద్రబాబు, డాక్టర్ గంగిసెట్టి శివకుమార్, అవ్వారు శ్రీధర్ బాబు, రాచపాళెం రఘు, బొగ్గవరపు రాధాకృష్ణ తదితరులు పాల్గొని గోపాలరావు కవితాభిలాషను గుర్తుచేసుకుని శ్రద్ధాంజలి ఘటించారు.

# ఇస్రో..మరో విజయం



గగనతలంలో ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధన సంస్థ) మరో ఘన విజయం సాధించింది. ఏప్రిల్ 22వ తేది మధ్యాహ్నం 2.20 గంటలకు చేపట్టిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి)–సి55 ప్రయోగం విజయవంతమైంది. అనుకున్నట్లుగానే సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను నిర్ణీత అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. పిఎస్ఎల్వి సీరీస్‌లో ఇది 57వ రాకెట్. ఇస్రోకి రామబాణం లాంటి ఈ రాకెట్‌ను శ్రీహరి కోట అంతరిక్ష ప్రయోగం కేంద్రం..షార్‌లోని మొదటి ప్రయోగ వేదికపై నుంచి ప్రయోగించారు. సింగపూర్‌కి చెందిన 741 కిలోల బరువున్న టెలియోస్–2తో పాటు, మరో 16 కిలోల లూమిలైట్ ఉపగ్రహాన్ని కూడా ఇస్రో శాస్త్రవేత్తలు గురితప్పకుండా ముందుగా నిర్దేశించిన కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంతో శ్రీహరికోటలోనే కాక దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కేవలం 20.51 నిమిషాలలోనే భూమికి 570 కిలోమీటర్ల ఎత్తులో నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహాలను చేరవేయడంతో ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతమైంది. ఇస్రో ఛైర్మెన్ డా.సోమనాథ్ మాట్లాడుతూ, పిఎస్ఎల్వి తన నమ్మకాన్ని నిలబెట్టుకుందన్నారు. ఈ విజయానికి కృషిచేసిన శాస్త్రవేత్తలందరినీ అభినందించారు. ఇదే ఉత్సాహంతో 2024 ఫిబ్రవరి నాటికి 'గగన్‌యాన్' ప్రయోగం కూడా చేపడతామని ఆయన చెప్పారు.

## వాణిజ్యపరంగా ముందంజ

ఇస్రో ఇలా వాణిజ్యపరమైన రాకెట్లను నిర్ణీత కక్ష్యలోకి చేర్చడంలో అగ్రదేశాలకు ధీటుగా తన ప్రతిభను చాటుకుంటోంది. ఇప్పటి దాకా 57 పిఎస్ఎల్వి రాకెట్లు, 2 ఎల్విఎం–3 రాకెట్ల ద్వారా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 35 దేశాలకు చెందిన 422 విదేశీ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. వీటి ద్వారా ఏడాదికి సుమారు వెయ్యికోట్లకు పైగానే వాణిజ్యపరమైన ఆదాయం లభిస్తున్నట్లు అంచనా. ఈ ఏడాదిలో వాణిజ్య ప్రయోగాలే ఎక్కువగా ఉండవచ్చని కూడా భావిస్తున్నారు.

## శ్రీసిటీ ఎం.డి సన్నారెడ్డి అభినందనలు

పిఎస్ఎల్వి–సీ 55 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం హర్షదాయకమని శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తన హర్షం వెలిబుచ్చారు. ఇస్రో అధ్యక్షులు కే.సోమనాథ్‌కు, షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్‌కు, షార్ శాస్త్రవేత్తలకు, ఉద్యోగులకు ఆయన అభినం దనలు తెలిపారు. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్.ఎస్.ఐ.ఎల్) ద్వారా ఇస్రో మరొక వాణిజ్య రాకెట్ ప్రయోగాన్ని సమర్థవంతగా నిర్వహించటం శ్లాఘనీయమని ఆయన పేర్కొన్నారు.



# పెంచలకోన బ్రహ్మోత్సవాలకు రండి!

**• సిఎం జగన్‌కు రామ్ ఆహ్వానం**

జిల్లాలో ప్రసిద్ధమైన పెంచలకోన క్షేత్రంలో మే 1 నుంచి జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు విచ్చేయవలసిందిగా సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. ఈనెల 25న ఆయన తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సిఎం జగన్‌ను కలిసి, స్వామివారి శేషవస్త్రాలను బహుకరించి, ఆహ్వానపత్రిక ఇచ్చి ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన ఈ సందర్భంగా సీఎంకి వివరించారు. అనంతరం దేవాదాయశాఖ మంత్రి సత్యనారాయణరావును, టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డిలను కూడా కలసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

# మానవాళికి మార్గదర్శకం.. భగవద్గీత

సర్వమానవాళికి మార్గదర్శకం భగవద్గీత అని త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి –నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి అన్నారు. ఈనెల 24న నెల్లూరు మూలపేటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇంకా అనేక ఆధ్యాత్మికగ్రంథాల విశిష్టతను వివరించారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే.. కఠినచర్యలు తీసుకోండి


**• పోలీసులకు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశం**



శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అంకితభావంతో కృషిచేయాలని, ముఖ్యంగా గ్రామాల్లో ప్రజల శాంతియుత జీవనానికి విఘాతం కలిగించేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 24న సోమవారం రోజున ఆయన 'స్పందన' కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ, బాధితులకు సత్వర న్యాయం చేసేలా పోలీసుల చర్యలుండాలని, సైబర్ మోసాలు, ఉద్యోగాల పేరిట మోసాలు చేసేవారిని ఒక కంట కనిపెట్టి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు చూసి ఎవరూ మోసపోవద్దని, రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపి మోసం చేస్తారని, అలాంటి ప్రకటనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. దురలవాట్లకు బానిసలై తల్లితండ్రుల్ని నిర్లక్ష్యం చేసే పిల్లలకు కౌన్సిలింగ్ ఇవ్వాలని, భార్యాభర్తల వివాదాల విషయంలో తొందరపాటు చర్యలు వద్దని, వారి పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి కాపురాలు చక్కదిద్దాలని సూచించారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని పోలీసులను హెచ్చరించారు. అనంతరం స్పందన అర్జీదారులకు భోజనం పెట్టి, చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## 'మల్లూరు' పంచాయతీకి..
# రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారం లభించింది. ఈనెల 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో భాగంగా, అమరావతిలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా, మల్లూరు పంచాయతి సర్పంచ్ దువ్వూరు విజయకుమార్‌రెడ్డి ఆ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్రంలో అధికశాతం మంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతున్న విభాగంలో 'మల్లూరు పంచాయతీ' రాష్ట్ర అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మల్లూరుకు ఈ అవార్డు లభించడం విశేషం. రాష్ట్ర పంచాయతిరాజ్ కమిషనర్ సూర్యకుమారి సమక్షంలో ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఆ పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను ఆయన అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

### 'మల్లూరు'కు అవార్డు హర్షదాయకం - జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

మల్లూరు గ్రామ పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు రావడం సంతోషదాయకమని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. పంచాయతిరాజ్ వ్యవస్థతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, 'పేదరికం లేని, మెరుగైన జీవనోపాధుల ఉత్తమ పంచాయతీ విభాగం'లో మల్లూరుకు అవార్డు లభించిందని ఆమె తెలిపారు.

### మంత్రి కాకాణి సహకారంతో ఉపాధి అవకాశాలు మెరుగు
**- సర్పంచ్ దువ్వూరు విజయకుమార్‌రెడ్డి**

ఈ సందర్భంగా సర్పంచ్ విజయకుమార్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, కృష్ణపట్నం పోర్టు ఉండడం వల్ల, అనుబంధ పరిశ్రమలు రావడం వల్ల గ్రామంలో ఉపాధి అవకాశాలు ఎంతగానో మెరుగయ్యాయని చెప్పారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో తమ గ్రామంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని, ప్రైవేట్ కంపెనీల్లో కూడా స్థానికులకు 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని పరిశ్రమల యాజమాన్యాలకు చెప్పడంతో ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు.

# ఎన్‌బికెఆర్‌లో టిసిఎస్ అవగాహన సదస్సు




కోట మండలం విద్యానగర్ లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వారిచే ఇటీవల విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన టిసిఎస్ సంస్థలో పనిచేస్తున్న అకడమిక్ విభాగాధిపతి సిహెచ్ రిచర్డ్‌కింగ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు విద్యార్థుల నుంచి ఎలాంటి పరిజ్ఞానాన్ని ఆశిస్తుంటాయో వివరించారు. కొత్తగా వస్తున్న క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనెలిటిక్స్ వంటి వాటిపై పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మా యూత్ అన్నదానం

నెల్లూరులోని అమ్మాయూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక దీనదయాళ్ నగర్‌లో పేదలకు అన్నదానం చేశారు. చిన్న సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తెల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్‌బాబు, ఆకాష్, కిరణ్, వంశీ, ధనుష్, ఆసిఫ్, శశి, కిరణ్, కార్తికేయ పాల్గొన్నారు.




## నివాళులు

సదాచార పరాయణులు,
మృదుభాషి
మాకు అత్యంత ఆత్మీయులు
మా కుటుంబ శ్రేయోభిలాషి
బ్రహ్మశ్రీ ఇంగువ వేంకట రాఘవశాస్త్రి గారి
మృతికి చింతిస్తూ...
వారి దివ్యస్మృతికి మా నివాళులు అర్పిస్తున్నాము.

**డాక్టర్ మర్లావుల సుబ్రహ్మణ్యం**
విశ్రాంత ప్రిన్సిపాల్, వి.ఆర్. కళాశాల, నెల్లూరు.
మరియు కుటుంబసభ్యులు


# శ్రీసిటీ.. ప్రపంచానికే ఆదర్శం

## అధ్యయనానికి ఆదర్శవంతమైన పారిశ్రామికవాడ - ప్రశంసించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



శ్రీసిటీ ప్రపంచానికే ఆదర్శవంతమైన పారిశ్రామిక వాడ అని, ప్రపంచవ్యాప్తంగా అధ్యయనానికి ఇదొక మోడల్‌గా ఉంటోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశంసించారు. ఈనెల 25వ తేది ఆయన శ్రీసిటీని సందర్శించారు. స్థానిక బిజినెస్ సెంటర్‌లో శ్రీసిటీ పరిశ్రమల సీఈఓల సమావేశంలో మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, వెనుకబడిన ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉపాధిని సృష్టించి, బంజరు భూమిని శక్తివంతమైన ఆర్థిక కేంద్రంగా మార్చిన ఘనత శ్రీసిటీదని అభినందించారు. ఇక్కడ శ్రామిక శక్తిలో 50శాతం మహిళలు కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో అద్భుతమైన రవాణా మౌళిక సదుపాయాల నిర్మాణానికి భారత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ప్రాతిపదికన పెట్టుబడి పెడుతోందన్నారు. చక్కని మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల అనుకూల వాతావరణంతో కూడిన ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీ ప్రగతి తనను ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. దేశంలోని 10 ఉత్తమ పెట్టుబడుల గమ్యస్థానాలలో ఒకటిగా అవతరించిన శ్రీసిటీ, ప్రధాని మోడీ సారథ్యంలోని 'సులభతర వ్యాపారం' పెంపు లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న 'న్యూ ఇండియా'కు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. భారీ ఉద్యోగాల కల్పనకు శ్రీసిటీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. మెట్రో కోచ్‌లు, ఆటోమొబైల్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఎఫ్ఎంసిజి, ఫుడ్ ప్రాసెసింగ్, ఎయిర్ కండిషనర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మస్యూటికల్స్ తదితర వివిధ రంగాల తయారీ పరిశ్రమలకు శ్రీసిటీ నిలయంగా మారిందని ప్రశంసించారు. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన పర్యావరణ చర్యల కారణంగా శ్రీసిటీ ప్రాంతంలో పర్యావరణ, ఆధ్యాత్మిక పర్యాటకానికి మంచి అవకాశాలు ఉన్నాయని, తమ మంత్రిత్వ శాఖ తరపున దీని మరింత అభివృద్ధికి అన్నిరకాల మద్దతును అందిస్తానని హామీ ఇచ్చారు. తొలుత మంత్రి కిషన్‌రెడ్డిని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదరంగా స్వాగతించారు. ఈ పర్యటనలో భాగంగా కిషన్‌రెడ్డి శ్రీసిటీ పరిసరాలను, బ్లూస్టార్ పరిశ్రమను సందర్శించి, అక్కడి ఉద్యోగులతో కొద్దిసేపు ముచ్చటించారు.

## 29న..'భవ్యహాసిని'
# భరతనాట్య ప్రదర్శన



ప్రముఖ భరతనాట్య కళాకారిణి, తమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని నల్లంగు భవ్యహాసిని ఏప్రిల్ 29తేదిన పాఠశాలలో నిర్విరామ భరత నాట్య ప్రదర్శన నిర్వహించనుందని స్కాలర్ స్కాలర్స్ స్కూల్ కరెస్పాండెంట్ పద్మజారెడ్డి తెలిపారు. అదేవిధంగా మే 10వ తేదీన తిరుమల కొండ నుంచి అలిపిరి వరకు 12 కిలోమీటర్ల దూరం నిర్విరామంగా భరతనాట్య ప్రదర్శన చేసేందుకు ఆ చిన్నారి నిర్ణయించుకుందని, గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించాలన్న లక్ష్యంతో, తల్లితండ్రులు ఎన్. సునీల్‌కుమార్–చెంచు లక్ష్మిల ప్రోత్సాహంతో భవ్యహాసిని ఈ నాట్యప్రదర్శనలకు సంకల్పించిందని పేర్కొన్నారు. నెల్లూరులోని కళాదీప్తి డ్యాన్స్ స్కూల్‌లో భవ్యహాసిని భరతనాట్యాన్ని సాధన చేస్తోందని, ఆ చిన్నారి కృషి సఫలీకృతం కావాలని కోరుకుంటున్నామన్నారు.

## ప్రగతినగర్‌లో చలివేంద్రం

నెల్లూరు దర్గామిట్టలోని ప్రగతినగర్ మెయిన్‌రోడ్‌లో స్థానిక 'పవర్ యూత్ స్వచ్ఛంద సేవాసంస్థ' ఆధ్వర్యంలో ఈనెల 23న మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేసి పేదలు, పాదచారుల దాహార్తి తీర్చారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు, సభ్యులు వెంకటసూర్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ఇన్‌చార్జి రేంజర్‌గా.. మాల్యాద్రి

నెల్లూరు ఇన్‌చార్జి రేంజర్‌గా సోమవరపు మాల్యాద్రి నియమితులయ్యారు. సామాజిక అటవీ విభాగంలో డెప్యూటి రేంజర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఇన్‌చార్జి రేంజర్‌గా అదనపు బాధ్యతలతో నియమించారు. నగరంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో ఇప్పటిదాకా ఉన్న రేంజర్ భాస్కర్‌రెడ్డిని నాయుడుపేట రేంజ్ అధికారిగా నియమించారు.



# సాహితీ సవ్యసాచి.. శ్రీశ్రీ

**- వేదం సూర్యప్రకాశం**
ఫోన్ : 98661 42006

'సింధూరం, రక్తచందనం, బందూకం..సంధ్యారాగం
పులి చంపిన లేడినెత్తురు..కలకత్తా కాళిక నాలిక'....అంటూ
అరుణార్ణవ భావాలతో..అభ్యుదయ గీతాలతో
సాహితీలోకానికి కొత్త ఊపిరులూదిన కవి.. మహాకవి శ్రీశ్రీ!
కవిత్వంలో... బాధితులే ప్రధానపాత్రధారులని నమ్మి
మహాప్రస్థానం..ఖడ్గసృష్టి, సిప్రాలి వంటి రచనలతో
జగద్విఖ్యాతి గడించిన ప్రజాకవి...శ్రీశ్రీ!
ఆక్రందనలు, ఆర్తనాదాలు..అన్యాయాలు..ఆవేదనలు
కవితల్లో కనిపించినా..నిరాశావరుల్లో నవోత్తేజం కల్పిస్తూ
కదం తొక్కుతూ, పదం పాడుతూ..హృదంతరాళం గర్జిస్తూ
ప్రగతిశీల భావాలతో జనచైతన్యానికి బాటలు వేసిన
నవ యుగ కవితా రవి..శ్రీశ్రీ!.....
'సాధించినదానికి సంతృప్తిని చెందీ
అదే విజయమనుకుంటే పొరపాటోయ్'..అని ప్రబోధించినా
'ప్రభువెక్కిన పల్లకి కాదోయ్..మోసిన బోయీలెవరని' ప్రశ్నిస్తూ
నిమ్నజాతికి నిలువెత్తు ఆసరాగా అక్షరాన్ని నిలిపిన
కార్మిక కర్షక కవి.. నిరుపేద జనం కవి.. శ్రీశ్రీ!...
అటు కవిత్వంలోనూ..ఇటు సినీగీతాల్లోనూ
తనదైన ప్రత్యేకతశైలితో రాణించి
చెలికన్నుల్లో దాగిన వెన్నెల సోనల..ప్రేమగీతాల్నీ
'ఓహో మోహనరూపా..కేళీ కలాపా..' అంటూ
భక్తిగీతాలనూ అత్యద్భుతంగా విరచించి
కవి కలానికి రెండు వైపులా పదునుంటుందన్న సత్యాన్ని
లోకానికి చాటిన మహోన్నత కవి..శ్రీశ్రీ
అందుకే!.. ఆయన నవయుగ కవితా యుగపురుషుడే కాదు..
ఆయనో వైతాళికుడు..సాహితీ సవ్యసాచి కూడా!
**(ఏప్రిల్ 30, మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా)...**

## 2023 -24 ఏడాదిలో రూ.21,600 కోట్ల పెట్టుబడి లక్ష్యంగా...

# నిర్మాణ రంగంలో రాణిస్తున్న నెల్లూరీయులు

### బెంగళూరు - చైన్నై - హైదరాబాదు మహానగరాలలో అర్బన్ రైజ్, అలయన్స్ సంస్థ నిర్మాణాలు


మనోజ్ నంబూరు


సునీల్ బొమ్మిరెడ్డి

*గత 20 సంవత్సరాలుగా బెంగళూరు, చెన్నై, హైదరాబాదు నగరాలలో రియల్ ఎస్టేట్ మరియు నిర్మాణరంగంలో తనదైన ముద్రను వేసుకుంటున్న నెల్లూరీయుల సంస్థలు అర్బన్ రైజ్, అలయన్స్. ఖాతాదారుల నమ్మకమే పెట్టుబడిగా నాణ్యమైన కట్టుబడితో సొంత ఇంటి కోసం కలలు కనేవారి కోరికను నెరవేరుస్తున్నారు ఈ సంస్థల సారథులు. ప్రపంచంలోనే అగ్రగామి రియల్ ఎస్టేట్ మరియు నిర్మాణ సంస్థగా తమ అర్బన్ రైజ్, అలయన్స్‌లని తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రస్థానాన్ని సాగిస్తున్నారు. తాజాగా **2023-24** ఏడాదిలో తాము చేపట్టబోతున్న నిర్మాణాల వివరాలను, తమ లక్ష్యాలను వెల్లడించారు సంస్థల ఛైర్మెన్ మనోజ్ నంబూరు, వైస్‌ఛైర్మెన్ సునీల్ బొమ్మిరెడ్డి.*

4.23 మిలియన్ల చదరపు అడుగులు కలిగిన 4199 నివాస గృహాలను విక్రయించడం ద్వారా, తమ అర్బన్ రైజ్, అలయన్స్ గ్రూప్ సంస్థల సారధ్యంలో 2022-23 సంవత్సరంలో 2,568కోట్ల వ్యాపార లావాదేవీలను నిర్వహించగలిగామని తెలిపారు.

ఇదే ఉత్సాహంతో 2023 -24 సంవత్సరానికిగాను 36మిలియన్ల చదరపు అడుగుల ప్రపంచస్థాయి గృహ నిర్మాణమే లక్ష్యంగా బెంగళూరు, చెన్నై, హైదరాబాదు నగరాలలో కట్టుబడులను చేపట్టబోతున్నట్లుగా ప్రకటించారు. ఇందుకుగాను 21,600 కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టనున్నామన్నారు.

6,800 కోట్లతో బెంగళూరులో 10 మిలియన్ల చదరపు అడుగులు, 8,900 కోట్లతో చెన్నైలో 16 మిలియన్ల చదరపు అడుగులు, 5,900 కోట్లతో హైదరాబాదులో 10 మిలియన్ల చదరపు అడుగుల అంతర్జాతీయ శ్రేణి గృహ సముదాయాల నిర్మాణాలను చేపట్టబోతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా సంస్థ ఛైర్మెన్ మనోజ్ నంబూరు మాట్లాడుతూ 2022 - 23 సంవత్సరంలో తమ సంస్థ నిర్మించిన 4,199 ఇళ్ల కొనుగోలుతో తమ ఖాతాదారులు ఇచ్చిన ప్రోత్సాహం తమలో ఉత్సాహం నింపిందని చెప్పారు. సంస్థ ప్రస్థానంలో ఇది మరో మైలురాయిగా అభివర్ణించారు.

నాణ్యతలో రాజీలేని నిర్మాణం, గృహ కొనుగోలుదారులు తమపై ఉంచిన నమ్మకం, చెప్పిన సమయంకన్నా ముందుగానే ఇళ్లను అందించడం, వసతుల కల్పనలో ప్రాధాన్యత, ఆర్థిక లావాదేవీలలో క్రమశిక్షణ వంటి అంశాలే తమ సంస్థలను పురోగతి వైపు నడిపిస్తున్నాయని అంటారు మనోజ్ నంబూరు.

నిర్మాణంలో వేగం, తమ దగ్గర కొనుగోలు చేసిన వారు తమకు తెలిసిన వారికి తమ సంస్థ గురించి గొప్పగా చెప్పడం, ముఖ్యంగా సొంత ఇంటి కలలు కనేవారి కలలను అతి తక్కువ సమయంలో సాకారం చేయడం వంటివే తమ సంస్థకి బలం అన్నారు.

మా దగ్గర కొనుగోలు చేసిన వారు ఇస్తున్న ప్రోత్సాహమే మా సంస్థ నిబద్ధతకి, అంకితభావానికి నిదర్శనమని సునీల్ బొమ్మిరెడ్డి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.


ఇది నిర్మాణ రంగంలో మన నెల్లూరీయులు సాధిస్తున్న అద్భుత ఘనత. రియల్ ఎస్టేట్ మరియు నిర్మాణ రంగంలో ప్రపంచస్థాయి సంస్థలతో పోటీపడడానికి అకుంఠిత దీక్షతో, అంకిత భావంతో తపిస్తున్న ఈ యువ సారథులకు ఆల్ ది బెస్ట్ చెప్తోంది 'లాయర్.'

## జొన్నవాడలో..

## మహాకుంభాభిషేకం ప్రారంభం



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షమ్మవారి దేవస్థానంలో దాదాపు పదిహేనేళ్ళ తర్వాత మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయమంతటా చలువ పందిళ్ళు వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 27 నుంచి ఈ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ విజయేంద్ర సరస్వతి అనుగ్రహాశీస్సులతో వారం రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 27న గణపతి హోమం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. 28వ తేదీన మహా సంకల్పం, అంకురార్పణ జరుగుతాయి. 29న దేవతా కళాకర్షణం, యాగశాల ప్రవేశం, లఘు పూర్ణాహుతి, 30న చండీపారాయణ హోమం నిర్వహిస్తారు. మే 1న గణపతి పూజ, పుణ్యాహవచనం, మూలమంత్ర హోమం, 2న జప హోమం, తత్వహోమం, యాగశాల వేదిక పూజలు నయానానందకరంగా కొనసాగుతాయి. మే 3న మహా కుంభాభిషేకం అత్యంత వైభవంగా జరుగుతుంది. అనంతరం వెండి నందిసేవ.. గ్రామోత్సవం తదితర కార్యక్రమాలన్నీ కన్నులపండువగా నిర్వహించనున్నారు. చివరి మూడు రోజుల్లో కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ విజయేంద్రస్వామి చేతులమీదుగా ఆలయంలో ఈ పూజలు, సేవలు జరుగుతాయి.




## ఇంటర్‌లో బాలికలు

## సత్తా చాటారు

### ఉత్తీర్ణతలో జిల్లాకు 4వ స్థానం

ఈనెల 26.. బుధవారం నాడు ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో నెల్లూరుజిల్లా రాష్ట్రస్థాయిలో 77 శాతం ఉత్తీర్ణతతో 4వ స్థానంలో నిలిచింది. ప్రథమసంవత్సరం ఇంటర్‌లో 25,535 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే, అందులో 17042 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయసంవత్సరం విద్యార్థులు 22,789 మందిలో 17,438 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం 69 శాతం, ద్వితీయంలో 79 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందు నిలిచారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 12452 మంది బాలికలు హాజరైతే, 8597 మంది ఉత్తీర్ణత(69శాతం) సాధించారు. ద్వితీయ సంవత్సరలో 11,388 మందికిగాను 9016 మంది (79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలుర విషయానికొస్తే, ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 13,083 మందిలో 8445 మంది(65 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర పరీక్షల్లో 11,401 మంది పరీక్షలు రాస్తే, అందులో 8422 మంది(74 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెండింటిలోనూ జిల్లా ఉత్తీర్ణతలో 4వ స్థానంలో నిలవడం విశేషం.

## తహశీల్దార్ల బదిలీలు

జిల్లాలో పలువురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ ఈనెల 26న జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులిచ్చారు. ఉలవపాడు తహశీల్దార్ హుస్సేన్‌ను కొండాపురానికి, అక్కడ పనిచేస్తున్న బ్రహ్మయ్యను ఉలవపాడుకు, మర్రిపాడు తహశీల్దార్ హేమంత్ బోగోలుకు, అల్లూరు తహశీల్దార్ శ్రీరామకృష్ణ కలిగిరికి, కలువాయి తహశీల్దార్ సోమ్లానాయక్ దుత్తలూరుకు, విడవలూరు తహశీల్దార్ చంద్రశేఖర్ అల్లూరుకు బదిలీ అయ్యారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# తెదేపాకు అపూర్వ స్పందన



రాష్ట్ర వ్యాప్తంగా వైకాపాకు ఆదరణ తగ్గి, తెలుగుదేశం పార్టీకి అనూహ్య ప్రజా స్పందన కనిపిస్తోందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. రెండో పట్టణ పరిధిలోని ఎగువ వీరారెడ్డిపల్లెలో ఇటీవల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలు పంచిపెట్టారు. తెలుగుదేశం పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. 20 మంది యువత, మహిళలు తెలుగుదేశం పార్టీ కండువాను వేసుకొన్నారు. శ్రీనివాసులు, చెంచురామయ్య, ఇజ్రాయిల్, వెంకటేశ్వరరాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సత్వర పరిష్కారమే లక్ష్యం

### - తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి



జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్‌లో స్పందన కార్యక్రమాలు నిర్వహించి అర్జీదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 24వతేదీ ఎస్పీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల సౌకర్యార్థం ప్రతి మూడు నెలలకు ఒకసారి డివిజన్ కేంద్రాల్లో 'స్పందన' నిర్వహిస్తున్నామని, ప్రతి అర్జీదారునికి సత్వరం న్యాయం చేయడమే లక్ష్యమన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చి వ్యయప్రయాసలు పడకుండా ప్రజల వద్దకే పోలీసులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపామని, ఎవరైనా అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా, కొనుగోలు చేసినా కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే పి.డి యాక్టు అమలు చేస్తామన్నారు. గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సి.ఐలు జి.దశరథరామారావు, హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, హరికృష్ణ, ఎస్సైలు బ్రహ్మనాయుడు, గోపాల్, పవన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### వాట్సాప్ ద్వారా

# సమస్యల పరిష్కారం



ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇకపై వాట్సాప్ నెం. 9490947555ను వినియోగించుకోవచ్చని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ప్రజలకు తెలియజేశారు. డివిజన్‌లోని సుదూర ప్రాంతాల నుండి స్పందనకు రాలేని ప్రజలు తమ సమస్యలను ఆ వాట్సాప్ నెంబరులో నమోదుచేస్తే సత్వరం ఆ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### చేవూరు రమణారెడ్డి ట్రస్ట్

# చలివేంద్రం



గూడూరు మండలం చెన్నూరు మెయిన్‌రోడ్డులో చేవూరు రమణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, మానవత ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల చలివేంద్రం ఏర్పాటు చేశారు. ట్రస్టు అధ్యక్షులు చేవూరు విజయ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యువత సేవాదృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ సంవత్సరం ఎండలు ఎక్కువుగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవత ఛైర్మెన్ దశరథరామిరెడ్డి, అధ్యక్షులు కలికి జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్.బాలరాజు, దండు జయరామిరెడ్డి, కృష్ణయ్య, దాము, సుధాకర్‌రెడ్డి, అంకయ్య, శంకరయ్య, పోలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


# స్వచ్ఛ స్మశాన వాటిక



గూడూరు రెండో పట్టణ పరిధిలోని అడవి కాలనీ సమీపంలోని స్మశాన వాటికలో పట్టణవాసి గోపాల్‌యాదవ్, అతని మిత్రులతో కలసి పిచ్చిచెట్లను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌యాదవ్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం తాము స్మశాన వాటికను శుభ్రం చేయిస్తున్నామని, తమ తండ్రి వీరిబోయిన రాఘవయ్య స్మశాన అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, పట్టణంలోని దాతలు కూడా సహాయం అందించాలని ఆయన కోరారు.

# చిన్నారులకు ప్లేట్లు గ్లాసులు

గూడూరు పట్టణంలోని వరద నగర్‌లో ఉన్న అంగన్‌వాడి పాఠశాల చిన్నారులకు ఇటీవల పట్టణానికి చెందిన ఉదయభాస్కర్ దాతృత్వంతో ప్లేట్లు, గ్లాసులు మరియు తినబండారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రనీల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

జాతీయ పంచాయతిరాజ్ దినోత్సవం సందర్భంగా ఈనెల 24న నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో, మండలస్థాయిలో ఉత్తమంగా ఎన్నికైన పంచాయతీలకు అవార్డులను అందించి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ మండలంలో మొత్తం 18 పంచాయతీలు ఉన్నాయి. పలు అంశాల్లో ఉత్తమంగా రాణించిన 8 పంచాయతీలను అవార్డులకు ఎంపికచేశారు. వాటిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన కొండ్లపూడి, కొమ్మరపూడి, ములుముడి, సౌత్ మోపూరు, ఉప్పుటూరు, గొల్లకందుకూరు, కాకుపల్లి, కలివెలపాళెం పంచాయతీల సర్పంచ్‌లను అభినందించి సన్మానించారు. రూరల్ ఎంపీపీ విజయకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, ఈఓపిఆర్డీ జలజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ వేదపండితుడు..

# ఇంగువ రాఘవశాస్త్రి ఇక లేరు



నెల్లూరులోని ప్రముఖ వేద పండితులు, వేద సంస్కృత కళాశాల కమిటీ పూర్వ కార్యదర్శి ఇంగువ వేంకట రాఘవశాస్త్రి ఇక లేరు. ఈనెల 21న పొగతోటలోని వారి నివాసంలో ఆయన కాలధర్మం చెందారు. వారి వయసు 83 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేదపండితులైన రాఘవశాస్త్రి నగరవాసులకు సుపరిచితులే. నగరంలోని మూలాపేట వేద సంస్కృత పాఠశాలలో వేదాధ్యయనం చేసిన రాఘవశాస్త్రి, వేదపరిషత్ కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని 'ఆంధ్రసభ', 'సింహపురి వేదాధ్యయన పరిషత్' మొదలైన సంస్థల్లో ఆయన కార్యనిర్వాహక సభ్యులుగా పనిచేశారు. నెల్లూరులోని సుప్రసిద్ధమైన భిక్షాటనా పూర్వక శ్రీ సద్గురు త్యాగరాజ స్మరణోత్సవ సభ కోశాధికారిగా కూడా ఆయన చాలా కాలం వ్యవహరించారు. సామాజిక కార్యక్రమాల్లోనూ తనవంతు సేవలందిస్తూ రాఘవశాస్త్రి అనేకమంది పేద విద్యార్థుల చదువులకు ఎంతో సహాయం చేసేవారు. ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త డా.ఇంగువ కార్తికేయశర్మకు రాఘవశాస్త్రి సహోదరులు. ఆయన మరణానికి చింతిస్తూ వారి ఆత్మీయులు, ప్రముఖ న్యాయవాది చతుర్వేదుల శ్రీరామమూర్తి, పి.ప్రభాకర్ రావు, వై.నాగదేవిప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త డా. కాళిదాసు పురుషోత్తం, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం, విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా. ఎం.సుబ్రహ్మణ్యం, దుర్భా జనార్దన్, దుర్భా మురలీకృష్ణ, జిఎస్ మురలీకృష్ణ, ప్రముఖ వైద్యులు పి.ఏ చంద్రశేఖర్, రైతుడిపో సుధాకర్, కె.జనార్దన్ తదితరులు రాఘవశాస్త్రి భౌతికకాయాన్ని సందర్శించి ఆయనకు కడసారి నివాళులర్పించారు.

# రౌడీమూకల నుంచి కాపాడండి

నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో కొందరు రౌడీషీటర్లు గ్రామంలో తరచూ భీభత్సాలు సృష్టిస్తున్నారంటూ అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 24న 'రౌడీషీటర్ల ఆగడాలను అరికట్టి రౌడీల నుంచి రక్షించండి' అంటూ ప్లకార్డు చేతపట్టి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. రౌడీలు గంజాయి తాగి, మారణాయుధాలతో తిరుగుతూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, గ్రామంలో ఆడవాళ్ళను, స్కూలు పిల్లలను అసభ్యకరమైన మాటలతో వేధిస్తున్నారని, అర్ధరాత్రి వేళ గ్రామంలోకి మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులను, రౌడీలను తీసుకువచ్చి ప్రజలను భయపెడుతున్నారని వారు పేర్కొన్నారు. ఆ రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పోలీసులు మందలించినా వాళ్ళ తీరు ఏమాత్రం మారడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వెంటనే దృష్టిసారించి రౌడీమూకల ఆగడాలను అరికట్టాలని, గ్రామం ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.





# కలెక్టర్, ఎస్పీలను కలసిన ప్రసన్న

నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హరినారాయణన్‌ను ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కలుసుకుని శుభాకాంక్షలు చెప్పారు. ఆయన వెంట నాయకులు గొల్లపల్లి విజయ్‌కుమార్, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, నెల్లూరు జిల్లా నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తిరుమలేశ్వర్‌రెడ్డిని కూడా ఎమ్మెల్యే ప్రసన్న మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు చెప్పారు.

# ఇరుకళలమ్మవారి ఆదాయం పెరిగింది



నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆదాయం పెరిగిందని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) తెలిపారు. ఇటీవల భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 9 లక్షలా 115 రూపాయలు ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది జనవరి 4 నుంచి ఈనెల 26వ తేది వరకు కేవలం 112 రోజులకు గాను ఇంతపెద్దమొత్తంలో హుండీ ఆదాయం రావడం ఆలయ చరిత్రలో ఇదే ప్రథమమని ఆయన పేర్కొన్నారు. ఈ లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ చైతన్య, ఇఓ బి.మల్లికార్జున్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు రాచూరు రమేష్‌యాదవ్, పల్లాల రాములమ్మ, కందుకూరు వెంకటేశ్వర్లు ఆచారి, కంచర్ల పెంచలమ్మ, కట్టా చిన్న, ప్రధాన అర్చకుడు పులికొలను చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

# జైన మందిరంలో ప్రత్యేక పూజలు

అక్షయ తృతీయ శుభదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు మండపాలవీధిలో ఉన్న జైనమందిరంలో కొలువైవున్న శ్రేయాన్స్‌నాథ్ మందిరంలో మొదటి తీర్థంకరుడు రిషబ్‌దేవ్‌కు ఆలయ పండితులు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కిషోర్‌జైన్ ఆధ్వర్యంలో భక్తబృందం వారు ఆలపించిన భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

35 Years of Academic Excellence.... ESTD : 1988

VISWASAI
Dr.SRK.SCHOOL

(Recognised by the Govt of A.P)
Magunta Layout, MSR Nagar, Nellore - 524 003.
Cont: 0861–2325199, Cell: 9951125173, 8977178176.
www.drsrkschools.com

Play Class to X Class

Why Choose Viswasai Dr. SRK School?

- Comfortable timings (8:40 AM to 4.40 PM).
- Well Experienced Staff.
- Stress free Education.
- Spacious Play ground, Lab, Library, Digi Lab, Computers, Sports, Games, Cultural and Literary Activities.
- Special emphasis on Communication Skills.
- All round development of the child.

Enquire, Visit, Know the facts and Decide

Admissions are opened for 2023 – 24.

## టూకీగా...



### వేదగిరిలో విశేష పూజలు

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువై ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఇటీవల పరశురామ జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మెన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, ఇఓ గిరికృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

### కోవూరు విద్యార్థికి బంగారుపతకం

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి 10వ జూనియర్ పవర్ లిఫ్టింగ్ క్రీడాపోటీల్లో కోవూరు డిగ్రీకళాశాల విద్యార్థి జి. దుర్యధన 53కేజీల విభాగంలో బంగారుపతకం సాధించి అందరి అభినందనలు అందుకున్నాడు. మే 12 నుంచి 17 వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి పోటీలకి కూడా ఆ విద్యార్థి ఎంపికయ్యాడు.

### కొత్తూరులో చోరీ

ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో ఇటీవల నెట్రంబాక్కం నాగరాజు ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తలుపులు తెరచి, బీరువా పగలగొట్టి 50వేల రూపాయలు, నాలుగున్నర సవర్ల బంగారు దొంగిలించుకుపోయారు. ఇందుకూరుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### రెజ్లింగ్‌లో కోట విద్యార్థి ప్రతిభ

ఇటీవల చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని కోటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి సుయోన్ బంగారుపతకం సాధించాడు. ఆ విద్యార్థిని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పీడీ సురేష్‌లు అభినందించారు.

### విఆర్ విద్యాసంస్థలను కాపాడాలి

నెల్లూరులోని చరిత్రాత్మకమైన విఆర్ విద్యాసంస్థలను కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 25న కళాశాల వద్ద విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### స్వర్ణదీపం ఆశ్రమంలో అన్నదానం

నెల్లూరు వేదాయపాళెంలోని స్వర్ణదీపం ఆశ్రమంలో ఈనెల 25న అన్నదానం నిర్వహించారు. న్యాయ విద్యార్థులు ప్రారంభించిన హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఫర్ పీపుల్ ఎంపవర్‌మెంట్ (హోప్) సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ నిర్వాహకులతో పాటు విఆర్ న్యాయకళాశాల విద్యార్థులు సుజాత, ఏ.మణి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు అటవీ అధికారుల సస్పెన్షన్

అటవీశాఖలో కావలి డివిజన్ పరిధికి సంబంధించిన ఇద్దరు అటవీ అధికారులను ఉన్నతాధికారులు ఇటీవల సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పెద్దవరం ఫారెస్టు బీట్‌ఆఫీసర్ విశాఖబాబు, రామాయపట్నం సెక్షన్ ఆఫీసర్ బ్రహ్మనాయుడులను సస్పెండ్ చేస్తూ డిఎఫ్ఓ చంద్రశేఖర్ ఉత్తర్వులిచ్చారు.

### మనుబోలులో విఘ్నేశ్వరునికి పంచలోహ కవచం

మనుబోలు విఘ్నేశ్వరాలయంలో కొలువైవున్న శ్రీ వినాయకస్వామికి స్థానిక భక్తులు పెనుగొండ సుధాకర్–శాంతి దంపతులు ఇటీవల పంచలోహ కవచాన్ని బహుకరించారు. అర్చకుడు సాయికుమార్‌శర్మ ఆ కవచానికి పూజలు చేసి స్వామికి అమర్చారు.

### సంతపేటలో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని ప్రైడ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంతపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో రోగులకు ఆరోగ్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు గాదంశెట్టి హేమంత్, కార్యదర్శి శశిధర్, కోశాధికారి పార్థసారథి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బయ్యా రవికుమార్, టివి కిషోర్, శరత్‌కుమార్, శ్రీనివాసులు, స్థానిక కార్పొరేటర్ కప్పిర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నీళ్ళశాఖలో..
# వందల కోట్లు దోచేస్తున్నారు

## పనులు చేయకుండానే కోట్లాది రూపాయల ప్రజాధనం తినేస్తున్నారు

### - మాజీమంత్రి సోమిరెడ్డి ధ్వజం



'నెల్లూరుజిల్లా నీళ్ళశాఖ (జలవనరుల శాఖ) అంతా అవినీతిమయంగా మారిపోయింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఆశాఖలో అవినీతి తారస్థాయికి చేరిపోయింది. కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులు అక్రమార్కుల జేబుల్లోకి వెళ్ళిపోతున్నాయి. తట్ట మట్టికూడా ఎత్తకుండానే కోట్లు దోచేసుకుంటున్నారు'.. అంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జలవనరుల శాఖ అవినీతికి నిరసనగా ఈనెల 26న టిడిపి కార్యకర్తలు, నాయకులు నెల్లూరు రామలింగాపురంలోని ఆ శాఖ ఇంజనీర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ఎస్‌ఇ కృష్ణమోహన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. అల్లీపురంలో అక్రమ లేఅవుట్‌లలో కోట్ల రూపాయల విలువైన నీళ్ళశాఖ స్థలాలు ఆక్రమణలకు గురవుతుంటే అధికారులు ఏంచేస్తున్నారని ఆయన నిలదీశారు. టిడిపి నాయకులు సోమిరెడ్డి, బీద రవిచంద్ర తదితర నాయకులంతా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, కోట్లరూపాయల ప్రజాధనాన్ని ఈ వైకాపా ప్రభుత్వంలో నాయకులు, అవినీతిపరులు తినేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటున్న ఇంజనీరింగ్ అధికారులు వైకాపా మంత్రులకు, నాయకులకు ఊడిగం చేస్తుండడం సిగ్గుచేటన్నారు. రెగ్యులర్‌గా వచ్చే నిధులు, డ్రైనేజీ నిధులు, ఎఫ్‌డిఆర్ నిధులు, ఓఅండ్‌ఎం నిధులు వగైరాలతో చేపట్టాల్సిన పనులు చేయకుండా, వైకాపా మంత్రులు, నాయకులతో కుమ్మక్కై ఒకే పనిని నాలుగైదు పద్దులుగా విభజించి, ప్రభుత్వ నిధులను వైకాపా నాయకులకు అడ్డగోలుగా కట్టబెడుతున్నారని, వీటన్నిటిపై సమగ్ర విచారణ జరిపించి అవినీతి పరులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకే పనికి వివిధ పద్దుల్లోని నిధులను పలుసార్లు బిల్లుచేయించుకుని బొక్కేస్తున్నారని, పిల్లకాలువల నుంచి పెద్దకాలువల వరకు పూడికలు తీస్తున్నట్లు చూపుతూ వందల కోట్లు జేబుల్లో వేసుకుంటున్నారని, అవినీతి ఇంజనీర్లు-వైకాపా నాయకులు అంతా కలసి ఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధుల సొమ్మును కూడా లక్షలకు లక్షలు కాజేస్తున్నారని, రైతులకు అన్యాయం చేస్తున్నారని, ఇంత ఘోరం ఎక్కడా చూడలేదని అన్నారు. తిరుమలమ్మపాళెంలో రైతులు సొంతంగా తవ్వుకున్న కాలువకు పది లక్షలరూపాయల బిల్లులు చేసుకున్నారని, ఆడిట్‌అధికారుల పరిశీలనలో ఆ విషయం బయటపడిందని ఆయన చెప్పారు. కనుపూరు కాలువ పరిధిలో 30కోట్ల దాకా అవినీతి జరిగిందని తాము అనుకుంటుంటే, సాక్షి పత్రికలో అంతకన్నా ఎక్కువగా 43కోట్ల కుంభకోణం జరిగిందని తాటికాయంత అక్షరాలతో రాశారని, ఈ అవినీతి అక్రమాలు ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే కాదు, జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలో జరిగాయని ఆయన పేర్కొన్నారు. వారి అవినీతి బయటపడుతుందని ఆ లెక్కల వివరాలు ఇవ్వడం లేదన్నారు. ఇకనైనా, గత నాలుగేళ్ళలో జిల్లా నీళ్ళ శాఖలో జరిగిన పనులు, నిధులు, ఖర్చులు, పెట్టుకున్న బిల్లులు అన్ని వివరాలను 10 రోజుల్లో సమగ్రంగా బహిర్గతం చేయాలని, లేకుంటే జలవనరుల కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

### దమ్ముంటే వివరాలు బయటపెట్టండి

#### - బీద రవిచంద్ర సవాల్

వైకాపా పాలనలో జిల్లా జలవనరుల శాఖలో జరుగుతున్న అవినీతి, అరాచకాలపై గత నాలుగేళ్ళుగా సోమిరెడ్డి ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని, ఆ శాఖలో జరుగుతున్న పనులు, ఖర్చుల వివరాలు ఇవ్వమని ఏడాదిగా కోరతున్నా ఇచ్చే దిక్కు లేదని, మీకు దమ్ముంటే ఆ వివరాలు బయటపెట్టాలని టిడిపి నేత బీద రవిచంద్ర ఈ సందర్భంగా వైకాపా నాయకులకు సవాల్ విసిరారు. ఈ ఆందోళనలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# బీద మస్తాన్‌రావు ఔదార్యం

## ఇల్లు లేని పేదలకు.. 8.5 ఎకరాల స్థలం కొనిచ్చారు



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) తన వితరణ గుణం మరోసారి చాటుకున్నారు. జగనన్న ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేస్తున్న జగనన్న కాలనీలకు, తమ స్వగ్రామమైన ఇసకపల్లిలో 8 ఎకరాల 5 సెంట్ల భూమిని పేదలకు అందజేసేందుకు, తన సొంత నిధులతో భూమిని కొనుగోలు చేశారు. ఇల్లు లేని పేదలు సొంతిళ్ళను నిర్మించుకునేందుకు ఆ భూమిని కేటాయించాలని కోరుతూ, ఆ రిజిస్టర్ పత్రాలను ఆయన ఇటీవల తహశీల్దార్ రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, వైకాపా నాయకులు బీద రమేష్, సర్పంచ్ రంజిత్‌కుమార్, కోడూరు సాధక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'అరుణకందము' గ్రంథావిష్కరణ



ప్రముఖ కవి, స్వర్గీయ పాటూరు శ్రీహరి రచించిన 'అరుణకందము' గ్రంథావిష్కరణ ఈనెల 23న నెల్లూరు బాలాజీనగర్‌లో జరిగింది. ఈ సభకు సంస్కృతాంధ్ర పండితులు, టిటిడి ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి డా. సూరం శ్రీనివాసులు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, వైదిక ఉపాసన అయినటువంటి అరుణప్రశ్నను కఠినమైన కందపద్యాలలో సునాయాసంగా శ్రీహరి అత్యద్భుతమైన రీతిలో అనువదించారని కొనియాడారు. బ్రహ్మశ్రీ అరివత్తూరు భర్గ గణపతి శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని కవి శ్రీహరి శ్రీవిద్యోపాసన గురించి, ఆయన పాండిత్య విశేషాలను, అరుణ మంత్ర వైశిష్ట్యాన్ని వివరించారు. విద్యాప్రవీణ కందాళ లక్ష్మీ నారాయణ, నిత్యాగ్నిహోత్రులు మాచవోలు వెంకటసుబ్బయ్య, గ్రంథ రచయిత శ్రీహరికి అల్లుడైన సూరం చంద్రశేఖరం తదితరులు పాల్గొన్నారు.

## డా. రేవూరుకు వెంకయ్య సన్మానం



జాతీయ సివిల్ సర్వీస్ దినోత్సవం సందర్భంగా ఇటీవల హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత, కవి, మన నెల్లూరీయుడు.. దూరదర్శన్ మాజీ డైరెక్టర్ జనరల్ రేవూరు అనంతపద్మనాభరావును సన్మానిస్తున్న భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు.

# రాజన్నా క్షమించు..!

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ యెదుగూరి సందింటి రాజశేఖరరెడ్డి అంటే ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలలో మూడు దశాబ్దాల పాటు ఒక సెన్సేషన్. 1978 నుండి 2009 వరకూ ఆయన పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగిపోయింది. 2003 ఏప్రిల్ నుండి జూన్ వరకు ఆయన చేసిన 'ప్రజాప్రస్థానం' పాదయాత్ర ఆయనను జన హృదయాధినేతగా అవతరింపజేసింది. 2004లో ఆయన అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన ఖ్యాతి ప్రపంచమంతా ఇనుమడించింది. చివరికి ఆయన మరణం కూడా యావత్ తెలుగు సమాజాన్ని, భారతీయ రాజకీయ రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి, ఒక కుదుపుకి గురిచేసిన విషాద ఉదంతంగా చరిత్రలో మిగిలిపోయింది.

### ఒక్కప్రమాదంతో మాయమైపోయిన ప్రమోదం...

రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం తరువాత ఆ కుటుంబంలో అనూహ్య పరిణామాలు చోట చేసుకుంటున్నాయి. వై.యస్ పరమపదించిన పది సంవత్సరాల తరువాత ఆయన కొడుకు జగన్‌మెహన్‌రెడ్డి విభజిత ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన సి.ఎం పగ్గాలు చేపట్టేవరకు ఆయన తల్లి, చెల్లీ ఆయన వెంటే ఉన్నారు. ఆయనకి బాసటగా ఆయన నడిచిన బాటే పట్టారు. అంతా సవ్యంగా ఉందని వై.యస్ అభిమానులు ఆనందపడుతున్న తరుణంలో ఊహించని అంశాలు అందరినీ షాక్‌కి గురిచేశాయి. అన్నతో చెల్లెలు విభేదించింది, చెల్లికి తోడుగా తల్లి నిలబడింది. ఇక్కడే వై.యస్ అభిమానులకు మింగుడుపడని అనేక సంఘటనలు జరిగాయి. రాజశేఖరరెడ్డి అమితంగా అసహ్యించుకునే ఒక మీడియా సంస్థకు తాను నేరుగా వెళ్లి షర్మిల ఇంటర్వ్యూ ఇవ్వడం రాజన్న అభిమానులకు అస్సలు నచ్చలేదు. ఆమెకు ఎవరైనా నచ్చచెప్తే బాగుణ్ణు అని వై.యస్. అభిమానులు భావిస్తున్న తరుణంలోనే షర్మిల మరోఅడుగు ముందుకేసి తెలంగాణలో పార్టీ ప్రకటించేశారు. విజయమ్మ కూడా ఆంధ్రాలో వైసీపీకి రాజీనామా చేసేశారు. షర్మిల పార్టీని తెలంగాణ ప్రజలు ఆదరిస్తారా లేదా అన్న విషయం పక్కన పెడితే... అక్కడ షర్మిల ప్రవర్తిస్తున్న తీరు తీవ్ర వివాదాస్పదమవుతుండడం వై.యస్ అభిమానులను కలతపెడుతోంది. పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆమె చేస్తున్న కామెంట్లు, ధర్నాల పేరుతో ఆమె నిర్వహిస్తున్న ప్రదర్శనలు, నిరసనల పేరుతో ఆమె చేస్తున్న దీక్షలు అన్నీ వివాదాస్పదమవుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మొన్న టీపీసీసీ పేపర్ లీక్ సంఘటనలో సిట్ అధికారులను కలుసుకోవడానికి ఆమె వెళ్లే సమయంలో జరిగిన డ్రామా వై.యస్ అభిమానులను తీవ్ర కలత పెట్టిందనడంలో సందేహమే లేదు. సంయమనం కోల్పోయి పోలీసులపై చేయి చేసుకోవడం, "మీకు పనిలేకపోతే పోయి గాడిదలు కాసుకోండి" అని ఆమె కామెంట్ చేయడం... "అదే చేస్తున్నాం" అంటూ సదరు పోలీసు అధికారి తెలివిగా సమాధానం ఇవ్వడం అత్యంత అవమానకరం. విజయమ్మ సైతం సహనం కోల్పోయి పోలీసుపై చేయి చేసుకోవడం అన్ని వర్గాలనుండి విమర్శలను ఎదుర్కోవడానికి అవకాశం కల్పించినట్లుగా అయ్యింది. ఒక వైపు వై.యస్. తనయుడు ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రంలో అధికార విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు అదే రాజన్న భార్య, కూతురు తెలంగాణ వీధుల్లో అధికారం కోసం పోరాడుతున్నారు.

### తమ్ముడి హత్య...
### వై.యస్. కుటుంబం చుట్టూ తిరుగుతున్న కథ...!

ఒకప్పుడు ఏ వై.యస్ కుటుంబం పేరైతే కీర్తిప్రతిష్టలతో మారుమ్రోగిపోయిందో.. ఇప్పుడు అదే వై.యస్. కుటుంబం వివాదాల వలయంలో చిక్కుకుంటోంది. రాజశేఖరరెడ్డి తమ్ముడు వై.యస్.వివేకానందరెడ్డి హత్య ఉదంతం వై.యస్ కుటుంబం చుట్టూ తిరుగుతోంది. వై.యస్.భాస్కరరెడ్డి ఆయన కుమారుడు అవినాష్‌పై సిబిఐ గురిపెట్టింది. అయితే, ఇదే క్రమంలో వై.యస్.వివేకానందరెడ్డి సహజీవనం చేశాడంటూ ఒక మహిళ పేరుని ఆధారాలతో సహా ఒక వర్గం బయటపెట్టింది. ఈ సంఘటనతో చనిపోయిన తరువాత ఆయన పరువుని బజార్లో పెట్టినట్లుగా అయ్యింది.

వివేకానందరెడ్డి హత్య మిస్టరీతో ఇటు ఆంధ్రాలోనూ, షర్మిల తీసుకుంటున్న తొందరపాటు చర్యలతో అటు తెలంగాణలోనూ వై.యస్. పేరుకి మచ్చ ఏర్పడుతోందన్న ఆవేదన వై.యస్. కుటుంబ అభిమానుల్లో వ్యక్తమవుతోంది. రాజశేఖరరెడ్డి బ్రతికి వున్నప్పుడు ఆయన కుటుంబాన్ని ఆరాధించిన ఆ కుటుంబ అనుయాయులు, అభిమానులు, అదే కుటుంబం ఆయన పరమపదించాక ఎదుర్కొంటున్న అవమానాలు చూసి తట్టుకోలేకున్నారు. 'రాజన్నా క్షమించు' అంటూ.... భోరున విలపిస్తున్నంతగా ఆవేదనకు లోనవుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు తెలుగు రాజకీయ గమనాన్ని ప్రభావితం చేస్తూ వచ్చిన... వై.యస్. అనే రెండు అక్షరాల భవిష్యత్ ఏమిటా అన్నది డాక్టర్ వై.యస్ అభిమాన లోకానికి అంతుపట్టడం లేదు.

# ఈసారీ టీ(బీ)ఆరెస్సే...!



లోక్‌సభకు 2024 ఏప్రిల్, మే నెల ప్రాంతాలలో ఎన్నికలు జరగాల్సి ఉంది. తెలంగాణ అసెంబ్లీకి మాత్రం ఈ ఏడాది నవంబర్, డిసెంబర్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అంటే, శాసనసభ ఎన్నికల్లో గెలిచిన పార్టీయే... అయిదారు నెలల తరువాత జరగనున్న లోక్‌సభ ఎన్నికల ట్రెండ్‌ను కూడా డామినేట్ చేస్తుంది. శాసనసభ ఎన్నికల్లో ఫ్రెష్‌గా గెలవడం, గెలిచిన పార్టీపై ఏర్పడే మోజు తగ్గడానికి సరిపడినంత వ్యవధి లేకపోవడం, డబ్బుకు కొరత అనేది ఉండకపోవడం మొదలైన కారణాల ఫలితంగా... తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల అనంతరం అధికారం చేపట్టే పార్టీయే లోక్‌సభ ఎన్నికల్లో చక్రం తిప్పడం సహజం.

అందుకే, ఈసారి తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు విశేషమైన ప్రాధాన్యం ఏర్పడింది. 13 జిల్లాల ఆంధ్రను బయటకు పంపేసి మిగిలిన 10 జిల్లాలతో కేంద్రం ఏర్పాటు చేసిన ప్రత్యేక రాష్ట్రంలో, 2014 నుంచి అప్రతిహతమైన అధికారంలో కొనసాగుతున్న బీ(టీ)ఆరెస్సును ఈసారి గద్దె దించాలని కేంద్ర బీజేపీ డిసైడ్ అయింది. దాని దూకుడుకు బండి సంజయ్ నోరు తోడయ్యింది. ఆయనకు లాజిక్‌తో అసలు పనిలేదు.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్‌ను సందర్భంతో పని ఉన్నా... లేకపోయినా విమర్శించడమే ఆయన ఎజెండాగా బీజేపీ రాజకీయం తెలంగాణలో నడుస్తున్నది.

సంజయ్ ఇక్కడ విమర్శలు గుప్పించడం... ఢిల్లీ పెద్దలు 'ఓహో... ఓహో...' అంటూ చప్పట్లు కొట్టడంతో తెలంగాణ బీజేపీ నేతలు ప్రస్తుతానికి మౌనంగా ఉంటున్నారు.

తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అంటే 60 స్థానాలు గెలిచిన పార్టీయే అధికారంలోకి వస్తుంది. 2018లో జరిగిన ఎన్నికల్లో ఒకే ఒక స్థానాన్ని బీజేపీ గెలుచుకుంది, రాజాసింగ్ రూపంలో. తరువాత జరిగిన ఉపఎన్నికల్లో మరో రెండు స్థానాలు తోడయ్యాయి.

ఇక, 2023 చివరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తమదేనని రాబోయేది తమ ప్రభుత్వ మేనని బీజేపీ నేతలు ఓ భారీ మైండ్‌గేమ్‌కు తెరదీశారు. ఇప్పుడే అధికారంలోకి వచ్చేశాము అన్నంత బిల్డ్‌అప్ ఇస్తున్నారు. చిత్రం ఏమిటంటే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, గెలవగలిగిన నేతలు బీజేపీలో లేరు. బీఆర్ఎస్ నుంచి ఎవరు వస్తారా.... కాంగ్రెస్ నుంచి ఎవరు వస్తారా అని చీకటి పడగానే, ట్యాంక్ బండ్ పై ఓరగా నిలబడి, 'పాసింజర్'ల కోసం ఎదురుచూసే వారిలాగా ఎదురు చూడాల్సిన దశలో తెలంగాణ బీజేపీ ఉంది.

మళ్లీ దీనికో కమిటీ. దానికి ఈటల రాజేందర్ అధ్యక్షుడు. ఇదీ బీజేపీ పరిస్థితి. సరే, బీజేపీ గెలిచిందే అనుకుందాం, మాట వరుసకు. ముఖ్యమంత్రి బండి సంజయ్యే అన్నట్టుగా బీజేపీ నేతల ప్రకటనలు ఉంటున్నాయి. దానితో, బండి సంజయ్‌ను, మంత్రి కేటీఆర్‌ను జనం పోల్చిచూస్తున్నారు. అది బీజేపీకి పెద్ద మైనస్.

అయితే, బీజేపీ ప్రధాని నరేంద్రమోడీ గానీ, బీజేపీ హోంమంత్రి గానీ... తెలంగాణ ఎన్నికలలోపు తలో పాతికసార్లు తెలంగాణలో పర్యటించవచ్చు. ఇక, పొద్దున్నే విమానం దిగి, రాత్రికే విమానం ఎక్కేసి పోయే కేంద్ర నాయకులకు లెక్కే ఉండకపోవచ్చు.

దీనివల్ల, తెలంగాణకు ఒక లాభమైతే ఉంది. నగదు చెలామణి బాగా పెరుగుతుంది.

టెంట్లు, మైకులు, స్టేజి డెకొరేషన్, పూల దండలు, శాలువాలు, బారికేడ్ల ఏర్పాటు, రవాణా వాహనాలు, బిర్యాని సరఫరాదారులు, హోటళ్లు, మందు బాటిళ్ళు, చివరలో... ఓటరు మహాశయులు మీటింగ్‌కి వచ్చినప్పుడు కరెన్సీ నోట్లు.

ఇన్ని రకాల జనం చేతిలో డబ్బులు ఆడతాయి. బీజేపీకి డబ్బుల కొరత లేదని అందరికీ అర్థమైపోయిన తరువాత, ఈ సభలు కూడా మరింత హుషారుగా జరుగుతాయి.

ముందు, బీజేపీ నేతలకు బ్రహ్మాండమైన కాలక్షేపం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎన్ని సీట్లు వస్తాయో తెలుసు కానీ, చెబితే బాగుండదని చెప్పట్లేదు.

నెక్ట్స్, కాంగ్రెస్.

తెలంగాణ కాంగ్రెస్‌లో కాకలు తీరిన యోధులు ఉన్నారు. 'అనేక యుద్ధముల నారితేరిన కురు






వృద్ధులు' ఉన్నారు. తమ రాజకీయ జీవితాలను కాంగ్రెస్‌కే ధారపోసిన నేతలు ఉన్నారు. దాదాపుగా ప్రతి నియోజకవర్గంలోనూ ఉన్నారు. జనంలోనూ కాంగ్రెస్ ఉంది.

అన్నీ ఉన్నా... అల్లుడు నోట్లో శని అన్నట్టుగా కాంగ్రెస్ నాయకత్వాన్ని టీడీపీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డి ఎగరేసుకు పోవడాన్ని మాత్రం కాంగ్రెస్ సీనియర్లు జీర్ణం చేసుకోలేకపోతున్నారు. వారిని రేవంత్‌రెడ్డి కూడా కేర్ చెయ్యడం లేదు. రేవంత్ రెడ్డి చూపు తెలంగాణ ముఖ్యమంత్రి పదవి మీద ఉంది. దానికి కాంగ్రెస్ పార్టీ ఒక సోపానంలా, ఒక చేతికర్రలా తనకు ఉపయోగపడుతుందని ఆయన భావిస్తున్నారు.

బీఆర్ఎస్ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌కే వస్తుందని, దాంతో తాను ముఖ్యమంత్రి అవడం ఖాయమని ఆయన నమ్ముతున్నారు. మరి, ఆయన మాట కారితనం ఆయనకు ఏ మేరకు ఉపయోగ పడుతుందో తెలియదు.

ఇంకో విచిత్రం కూడా ఉంది ఇక్కడ.

బీఆర్ఎస్ బీజేపీ ఒక్కటే అని రేవంత్ రెడ్డి అంటారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే అని బీజేపీ సంజయ్ అంటారు. అసలు... కాంగ్రెస్, బీజేపీ తోడు దొంగలు అని కేటీఆర్ అంటారు.

ఏది నిజమో.... ఏది కాదో ఎవరికీ తెలియదు.

వీరు గాక, రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల కూడా కొంగు బిగించి తెలంగాణ రాజకీయ గోదాలోకి దిగేశారు.

వీరు గాక, కేసీఆర్‌ను ఎదిరించడానికి, సహాయ పాత్రల్లో మరి కొంతమంది యాక్టర్లు ఉన్నారు. తెలంగాణ జన సమితి అంటూ కోదండరామ్, కేసిఆర్‌ను తిట్టిపోసే వీడియోల ద్వారా బాగా పాపులర్ అయిన చింతపండు నవీన్ అనే తీన్మార్ మల్లన్న వంటి పలువురు.... ఎవరి వలను వారు తీసుకుని, తెలంగాణ చెరువులో... ఎవరి చేపలను వారు పట్టుకోడానికి వేటకు బయలుదేరుతున్నారు.

విశేషం ఏమిటంటే, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడేవాళ్ళల్లో... ఏ ఇద్దరి మధ్యా సఖ్యత లేదు.

అయితే, తెలంగాణ కల్లోలిత రాజకీయాల్లో కేసీఆర్ ఒంటరిగా ఏమీలేరు. తెలంగాణ జిల్లాలో గణనీయమైన ఉనికి కలిగిన సీపీఐ, సీపీఎం... కేసీఆర్‌కు భుజం కాస్తున్నాయి.

కాలం కలిసొచ్చిన రోజుల్లో, "తోక పార్టీలు" అని ఈసడించినప్పటికీ ఇప్పుడు ఆ రెండు పార్టీల సాయం తనకు ఎంత అవసరమో... మొన్న జరిగిన మునుగోడు ఉప ఎన్నిక –తెలంగాణ ముఖ్యమంత్రికి తెలిసి వచ్చేటట్టు చేసింది. ఆ రెండు పార్టీలకు కూడా – తెలంగాణ అసెంబ్లీలోకి కుడికాలు పెట్టడానికి .... బీఆర్ఎస్‌ను మించిన 'వైకుంఠ ద్వారం' మరోటి లేదు.

ఇదీ తెలంగాణలో స్థూలంగా నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితి.

- కేటీఆర్ రూపంలో చదువుకున్న నాయకత్వం...
- హరీష్‌రావు హుందా రాజకీయాలు....
- హైదరాబాద్‌లో పరుగులు పెడుతున్న వసతులు, సౌకర్యాల అభివృద్ధి....
- కేసీఆర్ లీడర్‌షిప్ ఇమేజ్....
- ప్రతిపక్షాల తీవ్ర అనైఖ్యత... ఒక స్థాయి లేని నాయకత్వాలు...
- కేసీఆర్‌ను విమర్శించడం తప్ప, తమకంటూ ఒక ఎజెండా ప్రతిపక్షాలకు లేదన్న భావం జనంలో కలగడం...
- తెలంగాణకు ఒక ఆస్తిత్వం కేసీఆర్ కల్పించారు అనే భావం జనంలో బలంగా ఉండడం...


ఇలా బీఆర్ఎస్‌కు అనేక సానుకూల అంశాలు ఉన్నాయి.

బీజేపీ గెలిస్తే, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తెలియదు. కాంగ్రెస్‌లోనూ అదే పరిస్థితి. కానీ, ఆ కన్ఫ్యూజన్ టీఆర్ఎస్‌లో లేదు. ముందుగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. సమయం చూసి, కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగిస్తారు. ఈ విషయంలో తెలంగాణ సమాజానికి పూర్తి స్పష్టత ఉంది.

ఇలా, సవాలక్ష కారణాలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేస్తాయి. అందువల్లనే, ఈ ఏడాది చివరిలో తెలంగాణ శాసనసభకు జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీయే ముచ్చటగా మూడోసారి అధికారం చేపడుతుందని తెలంగాణ రాజకీయవర్గాల వారు భావిస్తున్నారు.

**– భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# 30న.. 'కళాంజలి' 35వ వార్షికోత్సవం



## 'శుభలేఖ సుధాకర్'కు పురస్కారం

నెల్లూరులోని 'కళాంజలి' సాంస్కృతిక సంస్థ 35వ వార్షికోత్సవ వేడుక ఏప్రిల్ 30వ తేది సాయంత్రం 6.05 గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో వైభవంగా జరుగనుంది. ప్రముఖ సినీనటుడు శుభలేఖ సుధాకర్‌కు 'కళాంజలి పురస్కారం', 'పాడుతా తీయగా' ఫైనలిస్ట్ శరత్‌చంద్రకు 'కళాంజలి అవార్డు' ప్రదానం చేయనున్నామని ఆ సంస్థ నిర్వాహకులు కళాంజలి అనంత్ తెలియజేశారు. రాజ్యసభ సభ్యులు, 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా, ఎస్ఏబిసిఏ వైస్‌ప్రెసిడెంట్ కాసా పెంచలవరప్రసాద్‌నాయుడు, మాడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, హైటెక్ ఫార్మాగ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వి రమణారెడ్డి, శుభ మస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వెంకటరవికుమార్, కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్య నాయుడు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. 'పాడుతా తీయగా' గాయనీ గాయకులు అనూష, నందిని, గాయత్రి, శ్రీకృతి, కృష్ణయ్యలచే 'కళాంజలి స్వరఝరి' (పాటల పల్లకి) వీనులవిందు చేస్తుందని, దారా సురేష్, శాంతికుమార్, విజయ్, సంగీత్, గిరి, ఖాదర్‌బాషాలు వాద్యసహకారం అందిస్తారని, శ్యాంసన్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా ఉంటారని, సంగీత సాహిత్య కళాభిమానులందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# శ్రద్ధాంజలి



జననం
12.04.1950

నిర్యాణం
21.04.2023

ఆధునిక భావాలున్న ఆదర్శరైతు
మానవీయ విలువలున్న మానవతామూర్తి
చిరునవ్వుతో పలకరించే స్నేహాభిలాషి
నిస్వార్థ నిష్కల్మష సేవాభిలాషి, మా కుటుంబ శ్రేయోభిలాషి

## శ్రీ మారంరెడ్డి గోపాల్‌రెడ్డి గారు

ఏప్రిల్ 21వ తేదీ శుక్రవారం ఉదయం పరమపదించారు.
**వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...**

భార్య : **మారంరెడ్డి ప్రసూన**

అల్లుళ్ళు - కుమార్తెలు
**ఆనం మహేష్‌కుమార్‌రెడ్డి - రాజి**
**ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి - రాధిక**

మనుమరాలు, మనుమలు
**సంజితారెడ్డి, నితీష్‌రెడ్డి**
**అనీష్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి**

మరియు **కుటుంబసభ్యులు**

### ః ఉత్తరక్రియలు ః

వారి పెద్దకర్మ తేది: **03.05.2023** బుధవారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరుజిల్లా, తోటపల్లిగూడూరులోని మా స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com